ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 10 జూలై 2025



దర్గాలో భక్తులకు గంధం పంచుతున్న ముస్లిం మత పెద్దలు

తరగని విశ్వాసం

నాల్గవ రోజూ తగ్గని భక్తుల రద్దీ • భక్తిశ్రద్ధలతో తహలీల్‌ఫాతేహా • నేడు పండుగ ముగింపు సభ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తరలివచ్చిన భక్తజనంతో 'స్వర్ణాల' తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నెరవేరిన కోరికలతో కొందరు.. కొత్త కోరికలతో ఇంకొందరు రొట్టెలను మార్చుకున్నారు. రొట్టెల పండుగలో నాల్గవ రోజు బుధవారం రోజంతా చెరువు ఘాట్ వద్ద రద్దీ నెలకొంది. ఈ ఒక్కరోజే రెండు లక్షలమంది కిపైగా భక్తులు వచ్చి ఉంటారని అంచనా. తమకు కావాల్సిన వరాల రొట్టెలను పట్టుకుని, బారాషహీదు లను సందర్శించుకుని పూజలు, మొక్కులు తీర్చుకున్నారు. ఉద్యోగం, ప్రమోషన్, వివాహ, విద్య రొట్టెలకు డిమాండ్ కనిపించింది. బారాషహీద్ దర్గా కమిటీ సారథ్యంలో దర్గాలో తహలీఫాతేహాను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమరుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువాలు నిర్వహించారు. మాదిగ కార్పొరేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి దర్గాలో పూజలు చేసి స్వర్ణాల చెరువులో ఆరోగ్య రొట్టె పట్టుకున్నారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఇతర ఉన్నతాధికారులు దర్గాలో కలియతిరుగుతూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు ఎస్పీ డి.సౌజన్య తదితరులు పోలీసు బందోబస్తు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్వర్ణాలచెరువు వద్ద వృద్ధులు, దివ్యాంగులకు పోలీసులు సహకరించారు. బోట్ క్లబ్‌లో గత నాలుగు రోజులుగా దాదాపు 4వేల మందికిపైగా భక్తులు బోట్ షికార్ చేయగా, పర్యాటక అభివృద్ధి సంస్థకు దాదాపు రూ.6.8 లక్షలు ఆదాయం వచ్చింది. కాగా, బోట్ క్లబ్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం రొట్టెల పండుగ ముగింపు సభ జరుగుతుంది. పండుగను విజయవంతం చేసేందుకు శ్రమించిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సత్కరించనున్నారు.



సాయంసంధ్యవేళ స్వర్ణాల చెరువు ఘాట్‌లో భక్తుల సందడి



నేడు గురుపౌర్ణమి



నెల్లూరు : బాలాజీనగర్ సాయిదర్బార్ వద్ద సీతారామచంద్రుల ఊరేగింపు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గురు పౌర్ణమి పర్వదినానికి జిల్లాలోని ఆలయాలు, సాయిబాబా మందిరాలు సిద్ధమయ్యాయి. శైవాలయాల్లో గురు మేధా దక్షిణామూర్తి స్వామికి, వైష్ణవాలయాల్లో హయగ్రీవుడికి, వ్యాస మహర్షికి గురువారం విశేష పూజలు జరగనున్నాయి. ఇక, సాయిబాబా మందిరాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యా యి. నెల్లూరు గాంధీబొమ్మ సెంట ర్‌లోని షిరిడీ సాయి మందిరంలో గురువారం నుంచి 8 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మం దిరం చైర్మన్ మన్నెం అమర నాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతీరోజు ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామార్చన జరుగుతాయని పేర్కొన్నారు. కాగా, బాలాజీనగర్ అద్దాల సాయిబాబా మందిరంలో బుధవారం గురు పౌర్ణమి ఉత్సవాలు మొదలయ్యా యి. ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండ రామ ఆలయం నుంచి శ్రీరామ చంద్రుడు సీతాలక్ష్మణ హనుమత్స మేతుడై ఊరేగింపుగా సాయి దర్బార్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విశేష పూజలు, అన్నదానం జరిగాయి.

పురపాకల సంఘాలకు మహర్దశ పట్టనుంది. కనీస మౌలిక వసతులైన మంచినీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి వంటి పనులు చేపట్టేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులు చేపట్టనుంది. ఇటీవల కాలంలో ఈ స్థాయిలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరవడం ఇదే ప్రథమం. పబ్లిక్ హెల్త్ విభాగం ఈ పనుల నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. 4 జిల్లాల పరిధిలో రూ.1,622.63 కోట్లను కేటాయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలకు ఇంటింటికీ తాగునీటి సరఫరాకు గానూ 310.37 కోట్లు మంజూరయ్యాయి. నీటి వనరుల అభివృద్ధికి రూ.22.33 కోట్లు దక్కాయి. నెల్లూరులో మురుగునీటి శుద్ధి నిర్వహణకు రూ.230.23 కోట్లు కేటాయించడం విశేషం.

పట్టణాలకు మహర్దశ

అమృత్ 2.0 కింద మౌలిక వసతులకు భారీగా నిధులు • నాలుగు జిల్లాలకు రూ.1622.63 కోట్లు

23 మున్సిపాలిటీల్లో ఇంటింటికి తాగునీరు • నెల్లూరులో మురుగునీటి నిర్వహణకు రూ.230 కోట్లు

రెండేళ్లలో పనులు చేయాలని లక్ష్యం • టెండర్లు ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్ అధికారులు

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలకు అమృత్ 2.0 పథకం కింద రూ.10,251 కోట్లను మంజూరు చేయగా అందులో పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.1,622.63 కోట్లను కేటాయించారు. ఈ సర్కిల్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలు ఉండగా, 23 అర్బన్ లోకల్ బాడీలకు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) నిధులను విభజించారు. ఆయా మున్సిపాలిటీల్లో అవసరాలను బట్టి నిధులు కేటాయించారు. అమృత్ 2.0 పథకం కింద నిధులను మూడు విభాగాలకు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి ఉన్నాయి. ఈ దఫా ఇంటింటికీ తాగునీటిని కుళాయిల ద్వారా ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసమే సింహభాగం నిధులను కేటాయించారు. ఒక్క ఒంగోలు కార్పొరేషన్‌కే రూ.224.42 కోట్లు మంజూరు చేశారు. పొదిలి, దర్శి, నెల్లూరు, వెంకటగిరి పట్టణాలకు కూడా భారీగా నిధులు దక్కాయి. ఇక నెల్లూరులో మురుగునీటి శుద్ధి నిర్వహణకు రూ.230.23 కోట్లు కేటాయించడం విశేషం. ఈ నిధులతో నెల్లూరు నగరంలో పెండింగ్ ఉన్న తాగునీటి, యూజీడీ పనుల్లో పురోగతి కనిపించనుంది. అలానే దాదాపుగా అన్ని మున్సిపాలిటీల్లో అక్కడ ఉన్న నీటి వనరులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు నిధులు మంజూరు చేశారు.

అమృత్ 2.0 కింద వివిధ మున్సిపాలిటీలకు మంజూరైన నిధుల వివరాలు...

మున్సిపాలిటీ	తాగునీటి సరఫరా (రూ.కోట్లు)	మురుగునీటి నిర్వహణ (రూ.కోట్లు)	నీటివనరుల అభివృద్ధి (రూ.కోట్లు)
నెల్లూరు	112.28	230.23	4.20
కావలి	15.26	----	3.20
బుచ్చి	7.91	---	1
అల్లూరు	14.98	---	1.15
ఆత్మకూరు	14.02	--	2.10
కందుకూరు	34.66	----	7.54
గూడూరు	26.11	---	4.50
వెంకటగిరి	114.84	---	---
సూళ్లూరుపేట	1.47	----	5
నాయుడుపేట	3.50	----	1.18

మొత్తంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలకు సంబంధించి ఇంటింటికీ తాగునీటి సరఫరాకు గానూ 310.37 కోట్లు మంజూరవడం గమనార్హం. నీటి వనరుల అభివృద్ధికిగానూ రూ.22.33 కోట్లు దక్కాయి.

• రెండేళ్లలో పూర్తి

అమృత్ 2.0 పథకం కింద పబ్లిక్ హెల్త్ అధికారులు రూ.1622.63 కోట్ల విలువైన పనులకు టెండర్లు ఆహ్వానించారు. గత నెల 30న టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈ నెల 28 వరకూ బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించారు. 23 మున్సిపాలిటీల్లో 73 వర్కులుగా విభజించారు. వాటన్నింటినీ ఒకే ప్యాకేజీగా టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. నెల రోజుల్లోపు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆ వెంటనే పనులు మొదలు పెట్టించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ పనులు మొదలైతే అన్నీ మున్సిపాలిటీల్లో అభివృద్ధి హడావిడి కనిపిస్తుంది. కాగా ఈ పనులపై పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 23 అర్బన్ లోకల్ బాడీల్లో 73 పనులకు గాను టెండర్లు పిలిచినట్లు తెలిపారు.



కావలి : ట్రంకురోడ్డులో కార్మికుల ప్రదర్శన

నిరసన గళం

జిల్లావ్యాప్తంగా సార్వత్రిక సమ్మె

కార్మికుల నిరసన ర్యాలీలు, మానవహారాలు

దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా కార్మికులూ సమ్మెలో పాల్గొన్నారు. కార్మిక జెండాలు చేతబట్టుకుని కార్మికుల నినాదాల హోరెత్తించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి వాటి స్థానంలో లేబర్‌కోడ్‌లను తీసుకురావడం కార్మికుల గొంతు కోయడమేనంటూ నిరసనకారులు ఆగ్రహంవ్యక్తం చేశారు. ఇప్పటికైనా లేబర్‌కోడ్‌లను వెనక్కి తీసుకుని కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- వివరాలు లోపలిపేజీల్లో..

'ఉపాధి' సొమ్ము భోక్తలపై వేటు

ఆరుగురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

కలువాయి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఉపాధి హామీ పథకం సొమ్మును స్వాహా చేసిన ఉద్యోగులపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. ఇందుకు బాధ్యులయిన ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుడు ఏ.మహేంద్ర రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పీ.బాబు రాజేష్, ఇన్‌చార్జి ఇంజనీరింగ్ అసిస్టెంట్ జే.శీనయ్య, సాంకేతిక సహాయకులు ఆర్.ప్రసన్న, ఎంవీ. ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లులను సస్పెండ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసును నమోదు చేశారు. అంతేకాక వారందరిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ డ్వామా పీడీ గంగాభవాని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే..

• జాబ్‌కార్డులతో సంబంధం లేకుండా...

2023-24లో చిన్నగోపరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కుటుంబాల జాబ్‌కార్డుల్లో గ్రామానికి సంబంధం లేని 148 మంది బయటవ్యక్తులను చేర్పించారు. వారంతా ఉపాధి పనులకు హాజరైనట్లు బోగస్ మస్టర్లు వేసి, భారీగా నిధులు స్వాహా చేశారు.అంతేకాక ఇప్పటి వరకు జరిగిన పలు పనుల్లో సిబ్బంది బోగస్ కొలతలు నమోదు చేసి, భారీగానే ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారు. ఈ విషయం 16వ విడత సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసింది. ఈఒక్క గ్రామంలోనే సుమారు రూ.59లక్షలు అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ అక్రమాలపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి బీ. భవానీహర్ష గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. అక్రమాలు బయటపడడంతో ఆరుగురు సిబ్బందిని శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించారు.



గవర్నర్ నజీర్ నుంచి ఉత్తమ సేవా అవార్డును అందుకుంటున్న రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్ వాకాటి విజయకుమార్ రెడ్డి

రెడ్‌క్రాస్‌కు ఉత్తమ సేవా పురస్కారం

నెల్లూరు (వైద్యం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు శాఖ అందిస్తున్న సేవలకు ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. ఈ అవా ర్డును బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి నెల్లూరు శాఖ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ చమర్తి జనార్దన్‌రాజు అందుకున్నారు. జిల్లాలోని అనేక కార్యక్రమాలలో సేవలు అందించిన రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యంకు కూడా ఉత్తమ సేవా అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ సేవలను కొనియాడారు. రెడ్‌క్రాస్ కమిటీ రాష్ట్ర చైర్మన్ రామారావు, ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా మాట్లాడుతూ దేశంలోనే నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలకు మంచి గుర్తింపు ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు డాకారపు రవిప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



అందరి సహకారంతోనే

కరేడులో భూసేకరణ!

'ఆంధ్రజ్యోతి'తో కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ

ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం భూసేకరణ ప్రక్రియను రైతులకు అర్థమయ్యేలా వారి సందేహాలు నివృత్తిచేసి ప్రజల సహకారంతోనే ముందుకు వెళతామని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ అన్నారు. భూములకు సరియైన ధర రాదన్న ఆందోళన కొందరిలోను, చేపల వేటకు అవకాశం ఉండదేమోనన్న భయాందోళన మత్స్యకారుల్లోనూ, కొన్ని కాలనీలు ఖాళీ చేయాల్సి ఉన్నందున వారికి ఎక్కడ పునరావాసం చూపిస్తారోనన్న సందేహం ఉందని అన్నారు. వీటన్నిటికీ స్పష్టమైన హామీలు ఇవ్వడం, వారిలో నమ్మకం కల్పించి వారి ఆమోదంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగించనున్నట్లు చెప్పారు. రైతుల ఆందోళనలు, వారు వ్యక్తంచేసిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించామని, ఈ సమస్యపై ఉన్నతస్థాయిలోనూ చర్చ జరుగుతోందని వివరించారు. కరేడులో భూసేకరణపై నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సబ్ కలెక్టరు శ్రీపూజ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- వివరాలు 8లో...

సీఎంతో చర్చించి

రైతులకు న్యాయం జరిగేలా చూస్తా

• ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు కోసం కరేడు గ్రామంలో భూసేకరణపై రైతుల అభిప్రాయాలను తెలుసుకోనున్నామని, వారి సందేహాలను 2, 3 రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరేడులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన రైతులను బుధవారం పిలిపించి వారి అభిప్రాయాలు తీసుకున్నట్లు చెప్పారు. రైతుల్లో రకరకాల అపోహలు సృష్టించడం వల్లే గందరగోళం నెలకొందన్నారు. ఒక భారీ పరిశ్రమ ఏర్పాటు కావాలంటే కొన్ని గ్రామాలకు నష్టం జరగడం సహజమని, అందుకు ప్రాంత అభివృద్ధి, పరిశ్రమ రాక కోసం కరేడు రైతులు సహరించాలని కోరారు.

మాలకొండ సమీపంలో

ఎంఎస్ఎంఈ పార్కు

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం మాలకొండ, అయ్యవారిపల్లె గ్రామాల మధ్య ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కానుంది. బీపీసీఎల్ పెట్రో రిఫైనరీ, పెట్రో కెమికల్స్ తయారీ పరిశ్రమ, ఇండోసోల్ సోలార్ ఎనర్జీ పరిశ్రమలకు అనుబంధగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు అవసరం ఉంటుందని గుర్తించిన అధికారులు అయ్యవారిపల్లె సమీపంలో ఎంఎస్ఎం పార్కు కోసం భూమిని పరిశీలించారు. అక్కడ ఉన్న 100 ఎకరాల ప్రభుత్వ భూమి చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఎంతో అనువైనదిగా భావించిన అధికారులు ప్రాథమికంగా 100 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని, భవిష్యత్‌లో విస్తరించాలన్నా ఇక్కడ అనుకూలమైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనువైనవిగా గుర్తించి ఆ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలిసింది. పోర్టు అధికారులు, ఏపీఐఐసీ అధికారులు అయ్యవారిపల్లె సమీపంలోని ప్రభుత్వ భూమిని ఇటీవల పరిశీలించారని, ఈ పార్కుతో నియోజకవర్గంలోని యువతకు ఉపాధి లభ్యమవుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభిప్రాయ పడ్డారు.

నేడు వడ్లపూడికి ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

మనుబోలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండలంలోని వడ్లపూడి పంచాయతీకి గురువారం రానున్నారని ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ఆయన హాజరై ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు అందించి ప్రజాసమస్యలు తెలుసుకుంటారు. కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9345
వెండి కిలో ధర	రూ. 110200
వెండి ఒక గ్రాము	రూ. 113.20

సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సోమిరెడ్డి



మాచర్లవారిపాళెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తోటపల్లి గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాచర్లవారి పాళెం గ్రామంలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రతి ఒక్కరు విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగించుకోవాలన్నారు. ఇంటింటా ఎమ్మెల్యేకి మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, పొన్నలూరు శివకోటారెడ్డి, నాయుడు ఆదికేశవరెడ్డి, మస్తాన్‌రెడ్డి, నీటిసంఘం డైరెక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు 13 వరకు గడువు

మనుబోలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 13 వరకు ప్రభుత్వం గడువిచ్చిందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. బుధవారం మనుబోలు-1,2 రైతుసేవాకేంద్రాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 5957మంది రైతులను ఈ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. వీరికి రూ. 20వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మూడు విడతలలో పెట్టుబడి సాయం కింద అందిస్తాయన్నారు. ఇంకా నమోదు చేసుకోని రైతులు దగ్గర్లో ఉన్న రైతు సేవాకేంద్రానికి వెళ్ళి పత్రాలు అందించి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం వరిసాగు పొలం క్షేత్ర పరిశీలన చేసి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

సంక్షేమానికి మారుపేరు ప్రశాంతిరెడ్డి



కరపత్రాలను అందచేస్తున్న టీడీపీ నాయకులు

విడవలూరు, జూలై 9: సంక్షేమానికి మారుపేరు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అని టీడీపీ నాయకులు ఆవుల వాసు తెలిపారు. రామతీర్థం గ్రామంలో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని ఫోన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధికి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్, హరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



ముత్తుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సింహాద్రి నగర్‌కు చెందిన పాపదేశి రాజేష్ రెడ్డి జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు మల్లి కార్జున రెడ్డి, లిఖిత, రాజేష్, స్నేహితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి తాపాన్ని తీర్చాలన్న ఉద్దేశ్యంతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు, పాదాచారులకు మజ్జిగ, రస్నా పంపిణీ చేశారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కావలి రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎస్. బెనర్జీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ జడ్జి ఎ.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు జి. మధుకుమార్, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల



పశు వైద్యశాల ఉన్నది ఈ భవనంలోనే..

తోటపల్లిగూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు మేజర్ పంచాయతీ పరిధిలోని 13 మజరా గ్రామాలు, చుట్టుపక్కల గ్రామాలకు అవసరమైన పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు అత్యాధునిక వసతులను కల్పించాల్సి ఉండగా ఏళ్ల తరబడి ఎదుగూ బొదుగూ లేకపోవడానికి రైతాంగం గుర్తు చేస్తున్నారు. గతంలో ఈ వైద్యశాల దుస్థితిని ఆనాటి మాజీ మంత్రి కాకాణి దృష్టికి తీసుకొచ్చినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పశుసంవర్ధక శాఖ కూడా తమకేమీ పట్టనట్లు నిధుల కొరత అంటూ దాటవేయడం గమనార్హం. ఎంతోమంది సేవా భావంతో పనిచేసే వైద్యులు ఉన్నప్పటికీ వైద్యశాల దుస్థితి కారణంగా వర్షాకాలంలోనూ ఇతర సమయాల్లోనూ విధులు నిర్వహించలేక చాలా అవస్థలు పడుతున్నారు. సరైన ప్రహరీ కూడా లేకపోవడం, భవనానికి పగుళ్లు ఏర్పడడంతో ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బందితోపాటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ వైద్యశాల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి, నూతన భవంతి నిర్మాణానికి కృషి చేయాలని కోడూరు రైతాంగం ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రసన్న ఓ చీడపురుగు.. తరిమికొట్టండి



విడవలూరు : స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

విడవలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఓ చీడ పురుగని, అతడిని నియోజకవర్గ ప్రజానీకం తరిమి కొట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దండిగుంట, వరిణి, వీరారెడ్డిపాలెంలో బుధవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలు సుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలో తనకు ఆదరణ పెరుగుతుండటంతో ఓర్వలేక ప్రసన్న కుమార్‌రెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తనకు సంఘీభావం తెలిపిన ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రజా ప్రతినిధులు, మహిళా లోకానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవ చేయటానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని, సమస్యలు ఎక్కడ ఉంటే వేమిరెడ్డి దంపతులు అక్కడ ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ ఛానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, దండిగుంట సర్పంచు బెల్లంకొండ సుప్రజ, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కుడుముల మల్లికార్జున, మద్దులూరి రాజ, బెల్లంకొండ శ్రీధర్, తూళ్లూరు మాధవ్, కొండా రఘు తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : రైతులతో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

పొరుదల కాలువ కల్వర్టును ఆధునికీకరిస్తాం

కోవూరు : పడుగుపాడు పంచాయతీ పరిధిలోని సదరన్ ఛానల్ కాలువ కల్వర్టును ఆధునికీ కరించనున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తెలిపారు. జాతీయ రహదారిపై రైల్వేలైను సమీపంలోని సదరన్ ఛానల్ కాలువ కల్వర్టును ఆయన బుధవారం శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరందించే కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టుకు మరమ్మత్తులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. భవిష్యత్తులో కాలువ నీటి వల్ల మునక తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపద్రవాల నివారణకు పరిష్కారంగా కాలువ పక్కన గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి సూచనల్ని అనుసరించి రైతులకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల సమస్యలను విన్న వెంటనే సదరన్ ఛానల్‌ను, జాతీయరహదారి పనుల్ని పరిశీలించేందుకు వచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకరరెడ్డి, మదన్‌రెడ్డి, అమరావతి, పెంచలయ్య, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

● బుచ్చి నగర పంచాయతీలోని 12, 5వార్డుల్లో బుధవారం సాయంత్రం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై అసత్య ప్రచారం

తోటపల్లిగూడూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగంపై తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ నీటి సంఘం అధ్యక్షులు వీరబోయిన గంగాధర్ అన్నారు. కోడూరు పంచాయతీ సచివాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పంచాయతీ నిధులను జంగిల్ క్లియరెన్స్, లెవలింగ్ పనులు, గిరిజనుల అభివృద్ధికి ఖర్చు చేశామని తెలిపారు. ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో తమ గురించి అసత్య ప్రచారం చేస్తున్నాడని ఇలాంటి విషయాలు పునరావృతమయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీటీసీ బైనబోయిన శ్రీనివాసులు, మత్స్యకార సంఘం నేత ఆవుల మునిరత్నం, కోడూరు సాగునీటి సంఘం డైరెక్టర్ పరంధా మయ్య, పోలంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కంజి సుధాకర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ కృషి

ముత్తుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జనసేన సర్వేపల్లి సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. బుధవారం బ్రహ్మదేవం పంచాయతీ లింగాయపాళెం గ్రామంలోని మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీహరి, రవి, అశోక్, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రావు, కృష్ణయ్య పాల్గొన్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న జనసేన నాయకులు

కసుమూరులో తగ్గిన భక్తుల రద్దీ

వెంకటాచలం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు బారాషాహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గాకు బుధవారం ఐదవ రోజు వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. భక్తులు దర్గా లో ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు బందోబస్తు కొనసాగించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మిక సంఘాలు



ముత్తుకూరులో సీఐటీయూ నాయకుల మానవహారం

ముత్తుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించేంతవరకు పోరాటం సాగిస్తామని సీఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనువాసులు, కృష్ణపట్నం క్లస్టర్ అధ్యక్షుడు గడ్డం అంకయ్య అన్నారు. దేశవ్యాప్త కార్మికుల సార్వత్రిక సమ్మె సందర్భంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల హక్కులు కాపాడాలంటూ నినాదాలు ఇచ్చారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, పారిశుధ్య, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

● **మనుబోలు :** సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం అన్నారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటియు నాయకులతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం మనుబోలులో ర్యాలీ నిర్వహించారు. ఆటోసెంటర్ వద్ద మానవ హారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వాలని, పనిభారం తగ్గించి, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు చెముడుగుంట ఆదిశేషయ్య పాల్గొన్నారు.

● **కోవూరు :** పట్టణంలో బుధవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు బజారు కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ ఎం మోహనరావు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26,000లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనలో భవన నిర్మాణ కార్మికులు, ఆశ,అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **సైదాపురం :** మండలకేంద్రంలో కార్మిక సంఘాలు బుధవారం బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేపట్టాయి. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి నెల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు డీపీ పోలయ్య మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెంగళ్‌రావు, నవకోటి, శ్రీనివాసులు, వెంకట రమణయ్య, వెంకటేశ్వర్లు, రత్నయ్య పాల్గొన్నారు.

● **రాపూరు :** అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు ప్రమీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు బుధ వారం నిరసన చేపట్టారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం డీటీ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు.

● **విడవూరు :** రైతులు పండించిన పంటలకు మద్దతు ధర పెంచాలని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మరాదని సీపీఎం నాయకులు, కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. సీపీ ఎం నాయకులు తూళ్లూరు గోపాల్, తలారి సురేష్, కుడుముల మోహన్, బడుగు సుబ్బయ్య, రామచంద్రయ్య, బండ్ల రమేష్, పసుపులేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





సైదాపురంలో ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కోవూరులో సీపీఎం కార్యకర్తల ప్రదర్శన

C.R.I.M.E N.E.W.S

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

బిట్రగుంట, జూలై 9(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని కొడవలూరు- పడుగుపాడు రైల్వే స్టేషన్ల మధ్య దిగువ మార్గం 184/12-14 కిలోమీటర్ల వద్ద రైలు పట్టాలపై (50) గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహం ఉన్న పరిస్థితిని బట్టి ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు బిస్కెట్ రంగు ఫుల్ చొక్కా, కాఫీ కలర్ లుంగీపై నలుపు, తెలుపు నిలువు గీతలు, నల్లని నిక్కర్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై సుబ్బయ్య అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

ఉపాధ్యాయినిపై ప్రధానోపాధ్యాయుడి దాడి

దగదర్తి(బిట్రగుంట), జూలై 9(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కట్టుబడిపాలెం జడ్పీ హైస్కూలో పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయినిపై అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడి చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉన్నత పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయిని బదిలీకి సంబంధించి రిపోర్టుల విషయంలో ఈనెల 7వ తేదీన ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావుతో ఆమెకు వివాదం జరిగింది. ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ మేరకు ఇద్దరూ ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఈ విషయమై స్థానికంగా విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జంపానికుమార్ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు

సంగం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసూయ నగర్‌లో బుధవారం 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి భానుచంద్రకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, అల్లూరు మండలం వీరారెడ్డిపాళెంకి చెందిన యువకుడు భానుచంద్ర అనుసూయనగర్ పెన్నానది ఒడ్డున ఉన్న పొలాలను లీజుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగిలి సరఫరాకు తరుచుగా అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ట్రాన్స్‌కో అధికారులకు తెలియకుండా భానుచంద్ర ఎల్‌సీ తీసుకోకుండా చెట్టు కొమ్మలను కొట్టే క్రమంలో సమీపంలో ఉండే 11 కేవీ విద్యుత్ లైను తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయలపాలయ్యాడు. గుర్తించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. అనంతర భానుచంద్రను 108 వాహనంలో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం చెన్నైకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరీ దిమ్మె కూలి ఒకరి మృతి

● మరొకరికి గాయాలు



సంఘటనా స్థలంలో తాతా వెంకయ్య మృతదేహం

కావలిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రహరీ గోడ గేటు దిమ్మె కూలి ఒక కూలీ మృతి చెందగా మరో కూలీకి గాయాలైన ఘటన కావలి పట్టణంలోని 8వ వార్డు చింతంవారివీధిలో బుధవారం జరిగింది. 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. చింతంవారివీధిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మురుగు నీటి కాలువ ఏర్పాటుకు ఎక్స్‌కవేటర్‌తో కాలువ తవ్వుతుండగా కొందరు కూలీలు కాలువలో మట్టిని తీయ్యసాగారు. ఈ క్రమంలో అక్కడ ఒక ఇంటి పాత ప్రహరీ గోడ దిమ్మె కూలి ప్రమాదవశాత్తు కూలీలపై పడింది. ఈ ఘటనలో బోగోలు మండలం సాంబశివపురంకు చెందిన వెంకయ్య(55) తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వైకుంఠపురంకు చెందిన మరో కూలీ మహబూబ్‌బాషాకు గాయాలయ్యాయి. వారి పక్కనే ఉన్న మరో ఇద్దరు కూలీలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతుడికి భార్య ఆదెమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సుమన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

● ముసునూరులో పలు దుకాణాల్లో ఎస్‌ఐ తనిఖీ



ముసునూరులోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తిరుమలరెడ్డి

కావలిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, పాఠశాలల సమీపంలో వంద మీటర్ల వరకు దుకాణాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు సిగిరెట్లు, బీడీలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి రూరల్ ఎస్‌ఐ తిరుమలరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ముసునూరులో పలు ఆలయాలకు సమీపంలో ఉన్న దుకాణాల్లో బుధవారం రాత్రి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాలు, పాఠశాలలకు సమీపంలో ఉన్న దుకాణాలపై నిఘా ఉంచామన్నారు. ఆయా దుకాణాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులైన గుట్కాలు, ఖైనీలతో పాటు సిగిరెట్లు కూడా విక్రయించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి, మత్తుపదార్థాలపై నిఘా

కావలి మండలంలోని గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాల వినియోగం, విక్రయంపై గట్టి నిఘా పెట్టామని సీఐ రాజేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిషేధిత వస్తువుల విక్రయం, ఎవ్వరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లయితే రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వైసీపీ నేతల దాడి

పొదలకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలోని టీడీపీ నాయకుడు సీతారామ నాయుడు, ఆయన కుమార్తె ప్రమీలమ్మ, మనుమడు శరత్‌చంద్ర, మనుమరాలు దాక్షాయనీలపై వైసీపీ నాయకులు కోదండయ్య, ధనుంజయలు దాడి చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఆస్తుల విషయంలో గొడవ చెలరేగడంతో కోదం డయ్య, ధనుంజయలు బంధువైన ప్రమీలమ్మను కొట్టి గాయపరచడంతో ఆమె చేతి వేలు విరగగా మిగిలినవారికి గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఏఎన్యూ దూరవిద్య పరీక్షలు

పెదకాకాని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ, డిప్లమా, సర్టిఫికెట్ ప్రోగ్రాం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వీ. వెంకటేశ్వర్లు, దూర విద్యా పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డీ. రామచంద్రన్ తెలిపారు. పరీక్షలు ఆగస్టు ఏడో తేదీ వరకు కొనసాగుతాయన్నారు. సెమిస్టర్ విధానంతో పాటు, వార్షిక, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550



పూల రథంలో ఉత్తర గో్గ్రహణం యుద్ధానికి వెళుతున్న అర్జునుడి అలంకరణ పక్కన భీష్ముడు, అర్జునుడి వేషధారులు

నేత్రపర్వం ఉత్తర గోగ్రహణం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవా ల్లో బుధవారం రాత్రి జరిగిన ఉత్తర గోగ్రహణం అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఉదయం హోమాలు, విశేష పూజలు, భగవద్గీత పారాయణం, చప్పర ఉత్సవం జరిగాయి. మహాభారతంలో పాండవులు అజ్ఞాతవాసం వీడే ఘట్టమైన ఉత్తర గోగ్రహణం సన్నివేశాన్ని భక్తులకు మూలాపేట వీధుల్లో ప్రదర్శించారు. పూల రథంలో అర్జునుడు ఉత్తర గోగ్రహణ యుద్ధం చేస్తున్నట్లు అలంకరించారు. పక్కన భీష్ముడు, అర్జునుడి వేషధారులు నిలబడి సన్నివేశాన్ని రక్తికట్టించారు. ఈ ఉత్సవానికి ఉభయ కర్తలుగా డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ వ్యవహరించారు. ఉత్సవాలను ఆలయ ఈవో యూ జానకి పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

హెపటైటిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ రజనీకాంత్

నెల్లూరు (వైద్యం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : హెపటై టిస్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అప్రమ త్తంగా ఉండాలని చెన్నై గ్లెనిగ్లెస్ హెల్త్ సిటీ లివర్ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ పచ్చా రజనీకాంత్ వెల్లడించారు. గ్లెనిగ్లెస్ హెల్‌సిటీ నెల్లూరు బ్రాంచ్ ఆసుపత్రిలో బుధవారం ఆయన మాట్లాడారు. హెపటైటిస్ వ్యాధి ఏ, బీ, సీ, డీ అనే నాలుగు రకాలుగా ఉంటుందని చెప్పారు. బీ, సీ రకాల వైరస్ చాలా ప్రమాదకరమన్నారు. కలుషిత రక్తం ద్వారా, రక్షణ లేని శృంగారం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని తెలిపారు. ఇది నేరుగా లివర్‌ను దెబ్బతీసి లివర్ సిర్రోసిస్, లివర్ కేన్సర్ వ్యాధులకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరు హెపటైటిస్ పరీక్షలు చేయించుకోవాలని, వ్యాక్సిన్ వేసుకుంటే వ్యాధిని నివారించ వచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పినాకినీ దేహ సమర్పకుల సభ్యత్వం నిలిపివేశాం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పినాకినీ దేహ సమర్పకుల సంస్థలో సభ్యత్వ నమోదు నిలిపి వేశామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంస్థను 2000 సంవత్సరం జూలై 9 తేదీన ప్రారంభించామన్నారు. ఈ పాతికేళ్లలో 103 మంది సభ్యత్వం స్వీకరించారని తెలిపారు. వీరిలో 59 మంది పురుషులు, 44 మంది మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. సభ్యత్వం పొందిన వారిలో 32 మంది పురుషులు, 25 మంది మహిళలు మరణించగా వారి దేహాలను వివిధ ఆసుపత్రులకు దానం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తన వయసు 74 సంవత్సరాలని, తన తర్వాత పినాకినీ దేహ సమర్పకుల సంస్థను నడిపించే వారసుడిని నియమించలేక పోవడం వల్ల సభ్యత్వ నమోదు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగిన జగన్ పర్యటనలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడిని నెల్లూరు ఏపీయూడబ్ల్యూజే ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. విధి నిర్వహణలో ఉన్న విలేకరులు, ఫొటో, వీడియో జర్నలిస్టులపై ఎవరు దాడి చేసినా బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బాధితుడు శివకుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.

నేడు కరేడుకు సీపీఐ రామకృష్ణ రాక

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ గురువారం కరేడు గ్రామంలో పర్యటించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పీ మాలకొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కందుకూరు నుంచి కరేడు వరకు యువజన, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో మధ్యాహ్నం 1 గంటకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, కరేడులో రైతుల అభీష్టానికి భిన్నంగా జరుగుతున్న బలవంతపు భూసేకణ ఆపాలని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చారి బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. బుధవారం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం బెల్టు షాపులు, కల్తీ మందుల తయారీ కేంద్రంగా మారిందని, రేషన్ మాఫియాలో స్థానిక ఎమ్మెల్యేకు వాటా ఉందని ఆరోపించారు.



జొన్నవాడ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



నిరసన తెలుపుతున్న విద్యుత్ శాఖ ఇంజనీర్లు, ఉద్యోగులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

● సీపీఎం రాస్తారోకో

నెల్లూరు రూరల్. జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను రద్దు చేసి, రైతులకు ప్రయోజనాన్ని చేకూర్చే స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రూరల్లోని జొన్నవాడ సర్కిల్ వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. దేశవ్యాప్త కార్మిక సార్వత్రిక సమ్మెలో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నాయకులు తిరుపాలు, జనార్దన్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. గడిచిన 13 ఏళ్లుగా కేంద్రం కార్మికుల చట్టాలను హరించడంతోపాటు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులపరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల అసంఘటిత రంగ కార్మికులపై పెత్తందారీ వ్యవస్థ పెరుగుతోందని వాపోయారు. స్మార్టు మీటర్లు పెట్టడాన్ని ఆపి, విద్యుత్ సవరణ చట్టం 2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, అనిల్, రమణయ్య, నాగయ్య, మస్తానయ్య పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో ఉద్యోగుల నిరసన

నెల్లూరు (జడ్పీ), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నగరంలోని విద్యుత్ భవన్‌లో బుధవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎన్‌సీసీవోఈఈఈ, ఏఐపీఈఎఫ్, ఏఐఎఫ్ఈఈ పిలుపుమేరకు దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా విద్యుత్ ఇంజనీర్లు విద్యుత్ భవన్‌లో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరూ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లక్ష్మీనారాయణ, బాలచంద్ర, సుధాకర్, శ్రీధర్, పరంధామయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

మాజీ డిప్యూటీ మేయర్ మాదాల



స్మార్ట్ మీటర్లు వద్దని కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని 29వ డివిజన్‌లో ఆయన ఇంటింటికి తిరిగి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాల ని కోరారు. ఆ మీటర్ల వల్ల కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఫీ అహ్మద్, మాలకొండారెడ్డి, దేవదాటి రాజా, గేక్ గౌస్‌పీర్. పోలయ్య, షేక్ జాకీర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలుగు మహిళలు

ప్రసన్న వ్యాఖ్యలు అనుచితం

● టీడీపీ మహిళల ఆగ్రహం

నెల్లూరు (వైద్యం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై టీడీపీ మహిళా నాయకురాళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, నగర అధ్యక్షురాలు రేవతి మాట్లాడారు.. మానసికంగా కుంగిపోయేలా మాట్లాడితే టీడీపీ మహిళలు భయపడతారని అనుకుంటున్నారన్నారు. వైసీపీ నేతలూ ఖబడ్దార్... టీడీపీ మహిళలు తగ్గేదు లేదని హెచ్చరించారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే సభ్యసమాజం క్షమించదన్నారు. జగన్ సతీమణి భారతిపై అసభ్యకరంగా మాట్లాడితే కిరణ్ అనే వ్యక్తిని జైల్లో పెట్టించి, మహిళలను అగౌరవ పరచకూడదనే సందేశాన్ని ఇచ్చిన నేత నారా చంద్రబాబు నాయుడు అని తెలిపారు. ప్రసన్నకు మాజీ మంత్రి అనిల్‌కుమార్ మద్దతివ్వడం సహించమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా అధికార ప్రతినిధి శ్రీదేవి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు సరికాదు

● రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



శ్రీదేవికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

నెల్లూరు (హరనాథపురం), జూలై 9(ఆంధ్రజ్యోతి) : సభ్యసమాజం తలదించుకునేలా మహిళలపై వ్యాఖ్యలు చేయటం సరికాదని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. బుధవా రం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసానికి వెళ్లి ఆమెకు సంఘీభావం తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతిరెడ్డిపై కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని చెప్పారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ మహిళల గురించి దారుణంగా మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీగా పోటీ చేసి డిపాజిట్ దక్కని అనిల్‌కుమార్ యాదవ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కాగా, ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం కోవూ రు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ సంఘీభావం తెలిపారు.

శ్రీదేవికి ఘన స్వాగతం

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యటనకు వచ్చిన మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు కాకి ప్రసాద్, డేగ రాఘవేంద్ర ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీమాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్య, కువ్వారపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు

అభివృద్ధి పనులు పూర్తిచేయడం గొప్ప

● మినీబైపాస్ రోడ్డు ఆధునీకరణ పనుల శంకుస్థాపనలో ఎంపీ వీపీఆర్

నెల్లూరు సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రారంభించి పూర్తి చేయడం గొప్పని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని మినీబైపాస్ రోడ్డు ఆధునీకరణకు రూ.15 కోట్లతో చేపట్టిన పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో మొదలుపెట్టిన ప్రతీ అభివృద్ధి పని పూర్తి చేస్తున్నారని ప్రశంసించారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి వీపీఆర్ ఎంతో సహకరిస్తున్నారన్నారు. కాగా, 29వ డివిజన్ వీఎంఆర్ నగర్ నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేసి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు నగరంలోని మినీబైపాస్ రహదారి అభివృద్ధి పనుల్లో ముందుడుగు పడింది. ఈ నెల 3వ తేదీన 'మినీబైపాస్‌కు మోక్షమెప్పుడు..?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడారు. వెంటనే పనులు మొదలుపెట్టాలని సూచించారు. ఈ క్రమంలో మినీబైపాస్ అభివృద్ధి పనులకు బుధవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.13.74 కోట్లతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని వారు ప్రకటించారు.

125 మంది తప్పిపోయిన

చిన్నారుల అప్పగింత

- వృద్ధులు, దివ్యాంగులకు అండగా పోలీసులు
- రొట్టెల పండుగలో ఎస్పీ కృష్ణకాంత్



చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జరుగుతున్న రొట్టెల పండుగలో వృద్ధులు, దివ్యాంగులకు పోలీసులు అండగా నిలుస్తున్నారని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. బుధవారం రొట్టెల పండగ బందోబస్తును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నాల్గవ రోజు రొట్టెల పండుగలో 125 మంది తప్పిపోయిన చిన్నారులను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారని చెప్పారు. సీసీఎస్ పోలీసులు ముగ్గురు జేబు దొంగలను అదుపులోకి తీసుకుని ఐదు మొబైల్ ఫోన్లు, ఆరు పర్సులు, ఒక ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు అందజేశారని తెలిపారు. దర్గాలోనికి ప్రవేశ, నిర్గమ ప్రాంతాల్లో, ఘాట్‌లో రొట్టెల మార్పిడి ప్రదేశాలలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల సంఘం-ఇండియా ఇంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసి అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. బుధవారం మొదటి బ్యాచ్ వలేటివారిపాలెం మండలంకు సంబంధించి 46 మందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ట్రైనర్లుగా బీ కృష్ణవేణి, సీహెచ్ సునీల్‌రెడ్డి బాధ్యత వహించగా, కందుకూరు నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వీ లావణ్య, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కన్యకాపరమేశ్వరికి శాకంబరి అలంకరణ



శాకంబరి అలంకారం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఆషాడ మాసం సందర్భంగా స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం శాకంబరి అలంకారం జరుగుతుందని ఆలయ చైర్మన్ కోటగురు బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ పేగు షణ్ముఖరావు. కమిటీ సభ్యులు తెలిపారు. 1000 కేజీల కూరగాయలు, 200 కేజీల పండ్లతో ఆలయాన్ని అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శాకంబరి అలంకరణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాకంబరి అలంకరణలో భాగంగా అమ్మవారి మూలమూర్తికి 300 కేజీల గోరింటాకుతో ప్రత్యేక అలంకారం జరుగుతుందని చెప్పారు. ఆ రోజు ఆలయానికి వచ్చిన మహిళా భక్తులకు చేతికి గోరింటాకును అలంకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శివయ్య స్వామి, ఆంజనేయులు, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, కమిటీ సభ్యులు పాబోలు సత్యనారాయణ, హజరత్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి...

నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా శుక్రవారం శాకంబరి అలంకారం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉభయక ర్తలుగా కొలపర్తి వెంకట రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మీ వ్యవహిస్తున్నారని పేర్కొన్నారు.

వన్యప్రాణులకు రక్షణ కరువు!

- అంతరిస్తున్న అటవీ ప్రాంతం
- ఆహారం, తాగునీరు కరువు
- జనారణ్యంలోకి చుక్కల దుప్పులు, జింకలు
- బిట్రగుంట రైల్వేస్టేషన్ ప్రాంతంలో సంచారం
- రైలు ఢీకొని, కుక్కల దాడిలో మృత్యువాత



రైల్వే ప్రాంతంలో సంచరిస్తున్న చుక్కల దుప్పులు

బిట్రగుంట, జూలై 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో సహజ సిద్ధమైన అటవీ ప్రాంతం రోజురోజుకి అంతరించిపోతోంది. అటవీ శాఖ అధికారులే అడవుల్లో జామాయిల్, నేరేడు, చందనం, కానుగ తదితర మొక్కలు నాటి పెంపకం చేపడుతున్నారు. దీంతో మరుగు లేక వన్యప్రాణులకు రక్షణ కరువైంది. వాటికి కావాల్సిన ఆహారం, తాగునీరు దొరకక జీవన విధానం కష్టతరంగా మారుతోంది. దీనితో విధి లేని పరిస్థితుల్లో వన్యప్రాణులు జనారణ్యంలోకి పరుగులు తీస్తున్నాయి. ఇలా వచ్చిన చుక్కల దుప్పులు, జింకలు కుక్కల దాడిలో, రైలు, రోడ్డు ప్రామాదాల్లో మృత్యువాత పడుతోన్నాయి. బోగోలు పంచాయతీ అక్కరాజువారి కండ్రిక, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు, నాగులవరం, తాళ్లూరు, సుందరగిరివారికండ్రిక పంచాయతీల శివారు ప్రాంతాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వలన ఆయా గ్రామాల్లోకి తరచూ జింకలు, చుక్కల దుప్పులు చొరబడుతోన్నాయి. అలాగే బిట్రగుంట రైల్వే లోకోషెడ్, కోల్‌యాడ్ ఉన్న సమయంలో రైల్వే కార్మికుల కోసం క్వార్టర్స్, కాలనీ ఇళ్లు, అధికారులకు బంగళాలు ఉండేవి. కాలా నుగుణంగా జరిగిన మార్పులు రావడంతో కార్మికుల సంఖ్య తగ్గిపోయింది. రైల్వే క్వార్టర్సుకు కాలం చెల్లి శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉ న్న కొన్ని ఇళ్లు, బంగళాలు, కార్యాలయాలను తొలగించారు. దీంతో బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు తూర్పు, పడమర ప్రాంతాల్లోని రైల్వే శిథిల భవనాల్లో ముళ్లచెట్లు మొలిచి అడవులను తలపిస్తుండడంతో ఈ ప్రాంతం లో కొంత మరుగు ఏర్పడిండి. దీంతో వన్యప్రాణులు నిత్యం అధిక సంఖ్యలో ఇక్కడ సంచరించడం వల్ల ఈ ప్రాంతం వాటికి ఆవాసాలుగా మా రింది. ఈ ప్రాంతాల్లో సంచరించే జింకలు, దుప్పులను పసిగట్టిన కుక్కలు దాడిచేసి చంపేస్తున్నాయి. వీటి నుంచి తప్పించుకునే క్రమంలో కొన్ని రైలు పట్టాలపైకి పరుగులు తీసి రైలు ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నాయి. రైలు పట్టాలకు తూర్పున కోవూరుపల్లి చెరువు, కడనూతల చెరువులు ఉం డటం వలన నీటికోసం రైలుపట్టాలు దాటుతూ కూడా మరికొన్ని మృతి చెందుతోన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి అటవీ ప్రాంతంలో తాగునీ వసతులు కల్పిస్తే వన్యప్రాణులు జనారణ్యంలోకి వచ్చే అవకాశం ఉండదు. తద్వారా రోడ్డు, రైలు ప్రామాదాలతో పాటు కుక్కల దాడి నుంచి వాటికి రక్షణ కల్పించవచ్చని ప్రజలు, జంతు ప్రేమికులుఅంటున్నారు. ఇందుకు సంబంధిత అధికారులు ఏ మాత్రం చర్యలు చేపడుతారో వేసి చూడాల్సిందే.



రైలు ఢీకొని మృతి చెందిన చుక్కల దుప్పి(ఫైల్)



ఉదయగిరి దుర్గం

దుర్గానికి జాతీయ గుర్తింపు

- యుద్ధనౌకకు 'ఉదయగిరి'గా నామకరణం
- గత వైభవం పునరావృతం అయ్యేనా...?
- ఎదురుచూస్తున్న ప్రజలు

ఉదయగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఓవైపు ఎత్తయిన కొండలు.. మరోవైపు శత్రుదుర్భేద్యమైన కోటలు.. చుట్టూ పచ్చని చెట్లు... పక్షుల కిలకిలరావాలు... మరోవైపు గలగల పారే సెలయేర్లతో ఉదయగిరి దుర్గం తిరుమల గిరులను పోలిఉంటుంది. జిల్లాకు వంద కిలోమీటర్ల దూరంలో, సముద్రమట్టానికి 3079 అడుగుల ఎత్తులో ఇది ఉంది. 20 కిలోమీటర్ల మేర విస్తరించి, ప్రకృతిశోభతో అకట్టుకునే ఈ దుర్గం క్రీస్తుశకం 10 నుంచి 19వ శతాబ్దం వరకు వెయ్యేళ్ల చరిత్రను తన గర్భంలో దాచుకుంది. ఇంతటి చారిత్రక నేపథ్యం గల దుర్గానికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించనున్నది. ఉదయగిరి పేరుతో యుద్ధనౌక రూపుదిద్దుకుంది. ఆగస్టు 26న నావికాదళం దీన్ని ప్రారంభించి, సముద్రంలోకి ప్రవేశపెట్టనున్నది. దీంతో ఉదయగిరి దుర్గానికి పూర్వవైభవం రానున్నదని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

● గతంలో కూడా ఉండేది..

చారిత్రక నేపథ్యం కలిగిన ఉదయగిరి పేరుతో యుద్ధనౌక ప్రారంభానికి సిద్ధమైంది. 149 మీటర్ల పొడవుతో 40 మిస్సైల్స్ ఉండేలా సుమారు రూ.600 కోట్లతో ఈ యుద్ధ నౌకను తయారు చేశారు. గతంలో కూడా ఉదయగిరి పేరుతో యుద్ధ నౌక ఉండేదని, అది శిథిలం కావడంతో ప్రస్తుతం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న యుద్ధ నౌకకు ఉదయగిరి నామకరం చేసినట్లు నౌకాదళ అధికారులు తెలిపారు.



● దుర్గంపై పర్యటన

యుద్ధనౌకకు ఉదయగిరిగా నామకరణం చేయడంతో విశాఖపట్నానికి చెందిన నావికాదళం దుర్గాన్ని సందర్శించింది. లెఫ్టినెంట్ కమాండర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు నరసింగరావు, నవీన్, ప్రకాష్ కుమార్ ఇటీవల స్థానిక అధికారులతో కలిసి ఉదయగిరి పట్టణం, దుర్గంపై పలు ప్రాంతాలను సందర్శించారు.చారిత్రాత్మక విషయాలపై చర్చించారు. పంచాయతీకి నౌకాదళ కమిటీ నుంచి సంక్షేమ నిధులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తామని బృందం సూచించింది.

ఉదయగిరి పేరుతో త్వరలో ప్రారంభం కానున్న యుద్ధనౌక

● నాటి వైభవం మళ్లీ వచ్చేనా..?

ఈ క్రమంలో ఉదయగిరి దుర్గానికి నాటి వైభవం మళ్లీ రానుందా...అంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉదయగిరిలో శ్రీకృష్ణ దేవరాయుల 500 ఏళ్ల పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించారు. ముగింపు సభలో అప్పటి మంత్రి పార్థసారధి రాయల నాటి ఉదయగిరి వైభవం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగాసనాలు వేసేందుకు కలెక్టర్ ఉదయగిరి రంగనాయకులస్వామి ఆలయాన్ని ఎంపిక చేశారు. ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించడంతోపాటు తాజాగా ఉదయగిరి నామక రణంతో యుద్ధనౌక ప్రారం భోత్సవానికి సిద్ధంగా ఉం డడం, త్వరలో రంగనాయ కుల స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించ నున్నారు. వీటికితోడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే రూ.కోటి మంజూరు చేయించడంతోపాటు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని బట్టి చూస్తే దుర్గానికి మంచిరోజులు రానున్నాయని తెలుస్తోంది

దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గాన్ని పర్యా టక ప్రాంతంగా ప్రకటించాలని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు రామచంద్రమూర్తి, షేక్‌ఎండీ ఖాజా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉదయగిరి చారిత్రక ప్రాధాన్యతను గుర్తించి రూ.600 కోట్ల వ్యయంతో నిర్మించిన నావికాదళం యుద్ధనౌకకు ఉదయగిరిగా నా మకరణంచేయడం అభినందనీ యమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉదయగిరి దుర్గాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు.

నా అక్రమ బదిలీకి కారణం చెప్పాలి

- ప్రాణం పోయేవరకు పోరాడుతా....!
- కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగి నిరసన



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగి భాస్కర్

నెల్లూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నన్ను ఎందుకు అక్రమంగా బదిలీ చేశారన్నది అధికారులు చెప్పాలి?, నా ప్రాణాలు పోయినా పర్వాలేదు, జైల్లో పెట్టి ఉరితీసినా సరే పోరాటం ఆపను.. అంటూ కావలి పట్టణం శాంతినగర్‌కు చెందిన సచివాలయ ఉద్యోగి రావెళ్ల భాస్కర్ నిరసనకు దిగారు. తనకు న్యాయం చేయాలంటూ బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ప్లకార్డు పట్టుకుని బైఠాయించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తనకు కావలి మున్సిపల్ కమిషనర్ ఉద్దేశ పూర్వకంగా అన్యాయం చేశారని ఆరోపించారు. తాను కౌన్సెలింగ్ జాబితాలో మొదట ఉన్నానని, తన తరువాత ఆరు మంది ఉన్నారని తెలిపారు. అయితే కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కావలిలో పోస్టింగ్ చూపి.. తీరా ప్రక్రియ పూర్తయ్యాక సూళ్లూరుపేట బదిలీ చేసినట్లు ఉత్తర్వులిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తన వెనుకున్న వారందరికీ కావలిలోనే బదిలీ ఉత్తర్వులిచ్చారని తెలిపారు. కావలి మున్సిపల్ కమిషనర్ అవినీతిని తాను ప్రశ్నించినందుకు కక్షపెంచుకుని తనకు అన్యాయం చేశారని, ఈ విషయం కావలి ఎమ్మెల్యేకి కూడా తెలిపానన్నారు. తనను ఎందుకు అక్రమంగా సూళ్లురుపేట బదిలీ చేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు నారా లోకేష్, పవన్ కల్యాణ్‌ల ఉద్యమాలే స్ఫూర్తని ప్రకటించారు. సమాచారం అందుకున్న పోలీసులు భాస్కర్‌ను అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నం చేశారు. ఈ సంఘటన తాజాగా సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

రాళ్లపాడు కుడి కాలువ గేటు మరమ్మతు పనులకు ఆమోదం

లింగసముద్రం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గత డిసెంబరులో దెబ్బతిన్న రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటు మరమ్మత్తు పనుల ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అప్పట్లో డ్యాం నుంచి వరినార్లకు నీటి విడుదల చేసేందుకు ప్రాజెక్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు ఇతర అధికారులతో కలిసి గేటును పైకి లేపుతుండగా గేటుకు, రాడ్డుకు మధ్యలో ఉన్న బోల్టు విరిగిపోయి తూముకు అడ్డుగా గేటు కిందపడి పోయింది. దీంతో అధికారులు గేటును పైకి లేపేందుకు నరసరావుపేటకు చెందిన మెకానిక్ బాషా, బెకామ్ కంపెనీకి చెందిన బృందాన్ని రప్పించి ప్రయత్నించి, విఫలమయ్యారు. చివరకు మెగా కంపెనీకి చెందిన ఎల్లయ్య డైవింగ్ టీం గేటును పైకి లేపడంతో నీరు విడుదల అయ్యాయి.దీంతో అధికారులు మరమ్మతులకు రూ.22.50 లక్షలు అవసరమని ఈ ఏడాది జనవరి 15వ తేదీన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.దీంతో బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రిమండలి ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఎస్‌హెచ్‌జీల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేసేందుకు గ్రూపుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వార్షిక రుణ, జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికపై అవగాహన సదస్సు జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీలకు రుణ పరిమితి పెంచి, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. పొదుపు మహిళలు చిన్నచిన్న యూనిట్లు స్థాపించేందుకు సహకరించాలని సూచించారు. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను విరివిగా అందించి వారు సులభంగా బ్యాంకు రుణాలు పొందేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమ క్రమబద్ధీ కరణ పథకం ద్వారా రెడీ టూ ఈట్, రెడీ టు కుక్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పొదుపు మహిళలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించి ఈ పథకం ద్వారా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను, అధికారులను ఆదేశించారు. తొలుత డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు సబ్సిడీపై కేటా యించిన పిండి మిల్లులు, చపాతి తయారీ మిషన్లు, వ్యవసాయ పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే కరేడులో భూసేకరణ!

- ఉన్నతస్థాయి పరిశీలనలో గ్రామస్థుల అభిప్రాయాలు
- మూడేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ల ఆధారంగా భూముల ధర నిర్ణయం
- 'ఆంధ్రజ్యోతి'తో కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ

? కరేడులో భూసేకరణ ప్రక్రియపై తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది కదా

! ప్రస్తుతానికి భూసేకరణ ప్రక్రియ యథావిధిగా నడుస్తోంది. రైతులలో రకరకాల భయాందోళనలు రేకెత్తి ఉన్నందున వారికి సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చి వారి సహకారంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తాము.

? భూములు ఇచ్చేదిలేదని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు కదా



! రైతుల ఆందోళనలు, వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, గ్రామసభ తీర్మానం తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్యపై ఉన్నతస్థాయిలో కూడా చర్చ జరుగుతోంది.

? రైతులంతా వ్యక్తిగతంగా మీకు అర్జీలు అందజేశారా

!. 573 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. ఈ అర్జీలపై భూసేకరణ నిబంధనల ప్రకారం ముందుకెళ్తాం. వారందరికీ భూసేకరణ అధికారి ప్రతిఒక్కరికీ వ్యక్తిగతంగా వారు తెలిపిన అభ్యంతరానికి సమాధానం పంపిస్తాము. ఆ తర్వాతే ప్రక్రియలో మరో అడుగు ముందుకు వేస్తాం.

? అంటే భూసేకరణ ప్రక్రియ ఆగే అవకాశం లేదంటారు

! అలా అని కాదు. ప్రభుత్వ నిర్ణయం, నిబంధనల ప్రకారమే ప్రక్రియ ఉంటుంది. కొందరు రైతుల్లో తమ భూములకు తగిన ధర దక్కదేమోనన్న సందేహాలు ఉన్నాయి. మత్స్యకారులలో తమ జీవనాధారమైన వేటకు అవకాశం లేకుండా పోతుందేమోనన్న సందేహాలు ఉన్నాయి. అలాగే ఇండోసోల్ కోసం ఖాళీ చేయించాల్సి వస్తున్న మూడు కాలనీల వాసులకు తమ పునరావాసం పరిస్థితి ఏమిటన్న ఆందోళన ఉంది. వారి సందేహాలను నివృత్తిచేసి వారికి సంతృప్తి కలిగేలా చేయగలిగితే భూసేకరణకు అంగీకరించే అవకాశం ఉంటుందేమో చూడాలి కదా.

? అసలు భూముల ధర నిర్ణయించారా

! మిగిలిన గ్రామాలతో పోలిస్తే కరేడులో రిజిస్ట్రేషన్ విలువలు తక్కువ ఉన్నాయి. ఆ విలువల ప్రకారం చూసి నిబంధనల ప్రకారం వచ్చే ధరలపై ఊహాగానాలు బయట ప్రచారంలో ఉన్నాయి. ఆ ప్రకారం అయితే మెట్ట, మాగాణి భూమికి రూ.15 లక్షలు, తోటలకు రూ.17 లక్షలు, జాతీయ రహదారి పక్కనుండే భూములకు రూ.60 లక్షలు పరిహారం అందే అవకాశం ఉంది. అయితే మూడేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ల ఆధారంగా సేల్‌వాల్యూలను చూసి సరాసరి చేసి రైతుల అభీష్టంమేరకు కొంత నెగోషియేట్ చేసి ధర నిర్ణయించే అవకాశం ఉంటుంది.

? కరేడు చెరువు, ప్రభుత్వ భూముల పరిస్థితి ఏమిటి

! చెరువులు, ఇతర వాటర్‌బాడీల జోలికివెళ్లం. అవి అలాగే ఉంటాయి. ఇక ప్రభుత్వ భూమి 1150 ఎకరాల వరకు భూసేకరణలో పోయే అవకాశం ఉంది. ఆ భూమికి కూడా రైతులకు ఎంతమొత్తం అయితే చెల్లిస్తారో ఆ ప్రకారమే ఇండోసోల్ కంపెనీ నుంచి ప్రభుత్వానికి చెల్లించటం జరుగుతుంది.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)



వింజమూరు : అరటి మొక్కలు, మామిడి తోరణాలతో పెళ్లి మండపంలా రూపుదిద్దుకున్న జడ్పీ హైస్కూలు

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 731 బేళ్లను తీసుకొని రాగా, 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. వారు 569బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 162 బేళ్లను తిరస్కరిం చారు. కేజీ గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ.159 పలికినట్లు వేలం నిర్వహణా ధికారి జీ.రాజశేఖర్ తెలిపారు.

మాదిగల అభివృద్ధికి రూ.40వేల కోట్లు

● మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి

నెల్లూరు (హరనాథపురం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మాదిగల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.40వేల కోట్లు కేటాయించినట్లు మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. బుధవారం నెల్లూరు పర్యటనకు వచ్చిన ఆమె ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. దళితులను అన్ని రకాలుగా ఆదుకోవటంలో భాగంగా డ్రైవర్లను కారు ఓనర్లుగా చేసే విధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో సబ్సిడీపై ఇన్నోవా కార్లు అందజేసిందని, విదేశీ విద్య పథకాన్ని అమలు చేసిందని చెప్పారు. వీటిని వైసీపీ ప్రభుత్వం కనుమరుగు చేసిందని విమర్శించారు. నెల్లూరు పర్యటనలో భాగంగా తొలుత ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని పరిశీలించానని శ్రీదేవి తెలిపారు. మాదిగల అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ లీడ్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థ

అమరావతి, జూలై9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరువు అనుసరణ, ఉపశమనం ద్వారా ప్రకృతి దృశ్య స్థాయి వ్యవసాయ పర్యావరణ పరివర్తన ప్రాజెక్ట్ అమలుకు లీడ్ ఏజెన్సీగా ఏపీ రైతుసాధికార సంస్థను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో ముగ్గురు అదనపు డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానశాఖలో 1,2 స్థాయి గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఆ శాఖ డైరెక్టర్ అధ్యక్షతన స్ర్కీనింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పట్టు పరిశ్రమశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ కేటగిరిలో 2017 నుంచి ప్రొబేషన్‌లో ఉన్న ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి, ఇప్పటికే రిటైరైన వారికి కోర్టు ఆదేశాల మేరకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించేలా ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రామలింగేశ్వర స్వామి 16 రోజుల పెళ్లి వేడుకలు

- నందివాహనంపై ఊరేగిన స్వామి
- తరలివచ్చిన భక్తజనం

విడవలూరు, జులై 9 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసిన శ్రీ కామాక్షీదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణం జరిగి బుధవారంతో 16 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారి 16 రోజుల పెళ్ళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన దొడ్ల వేణుగోపాల్ రెడ్డి, సతీమణి వంశీప్రియ, కుమారుడు సాయి నిఖిల్ రెడ్డి, కోడలు నిహారిక ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. తొలుత ఆలయ అర్చకులు పేరేపి శ్రీకాంత్ శర్మ, స్వామి, అమ్మవార్లకు మహాన్యాస రుద్రాభిషేకాలు, నివేదన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ, అన్న ప్రసాద వినియోగం నిర్వహించారు. సుందరంగా ముస్తాబు చేసిన నందిసేవ వాహనంపై రామలింగేశ్వరునికి సతీసమేతంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు బీఎంఆర్ హేచరీస్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అఖండ శివనామ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈవో బొగ్గల మల్లికార్జునరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ నాటారు విజయకుమార్, దాడి సన్యాసి రావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో చర్చిద్దాం.. విద్యార్థులను చదివిద్దాం..!

- నేడు ప్రతిష్టాత్మకంగా మెగా పీటీఎం-2.0
- విద్యార్థుల భవిష్యత్‌కు రాష్ట్ర ప్రభుత్వం భరోసా

నెల్లూరు (విద్య), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థలో అతిపెద్ద పండుగను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా 3,422 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనుంది. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల వికాసం, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం మార్గనిర్దేశం చేయడంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ వారధిగా ఈ సమావేశం నిలుస్తుందని అధికారులు తెలిపారు. విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందచేయనున్నారు. విద్యార్థుల మార్కులకు సంబంధించి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందచేయనున్నారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంపై వివరించి ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన బుక్‌లెట్ పంపిణీ చేస్తారు. డ్రీమ్‌వాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులతో వారి లక్ష్యాలను దానిపై రాయిస్తారు. అమ్మపేరుతో మొక్కలు నాటేలా ప్రోత్సహిస్తారు. కాగా, ఈ ఏడాది ప్రైవేట్ విద్యాసంస్థల్లోనూ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అన్ని జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు ఇది వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

● సర్వం సిద్ధం చేశాం : డీఈవో

జిల్లావ్యాప్తంగా గురువారం జరిగే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు. జిల్లాలోని వివిధ స్థాయిల్లో ప్రజాప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటారు. ప్రతి పాఠశాలలో వైద్య శిభిరాలు ఏర్పాటుచేయడంతో పాటు 2,30,330 మంది విద్యార్థులతో మొక్కలు నాటించనున్నాము.

పీఎంఏజీవై అమలుకు అప్రైజల్ కమిటీ

అమరావతి : పీఎంఏజీవై పథకం అమలుకు జిల్లా స్థాయి ప్రాజెక్టు అప్రైజల్ కం కన్వర్జెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్/కమిషనర్ చైర్‌పర్సన్‌గా, జడ్పీ సీఈఓ వైస్ చైర్‌పర్సన్‌గాను, పంచాయతీరాజ్ ఎస్ఈ, డీఆర్‌డీఏ పీడీ, మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ, డీఈఓ, డీఎంఅండ్‌హెచ్ఓ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ /ఈఈ, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఎన్ఐసీ డీఎం, ఐదు పీఎంఏజీవై గ్రామాల నుంచి ప్రతినిధులు తదితరులతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఆరో క్రస్ట్ గేట్ ద్వారా నీటి విడుదల



క్రస్ట్‌గేట్ ద్వారా విడుదల చేసిన జలాలు

అనంతసాగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 149 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, జలాశయంలో 29.160 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 6వ నెంబర్ క్రస్ట్ గేట్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 325 క్యూసెక్కుల నీటిని దుదల చేస్తున్నామన్నారు. క్రస్ట్‌గేట్ ద్వారా నీరు విడుదల చేయడంతో సోమశిల-నెల్లూరు మధ్య రాకపోకలు స్తంభించాయి.

కార్మిక అనుకూల నిర్ణయాలు ఉండాలి

● బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో సుబ్బారెడ్డి




ఏపీజీబీ రీజనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 9(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్‌లో కార్మిక అనుకూల నిర్ణయాలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి పీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరులోని ఏపీజీబీ రీజనల్ కార్యాలయం వద్ద బ్యాంకు యూనియన్ నాయకులు, అధికారులు, ఉద్యోగులు సమ్మె చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్మికులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు కార్మిక వ్యతిరేకంగా ఉన్నాయని ఆరోపించారు. బ్యాంకుల్లో ఐపీవోను ప్రవేశపెట్టారని, ఉద్యోగ నియామకాలు లేవన్నారు. పని ఒత్తిడి పెరిగిపోయిందన్నారు. బ్యాంకులను, ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయాలన్న కేంద్రప్రభుత్వ ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో ఏపీజీబీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ కార్యదర్శి లియాఖత్ అలీ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు

- లేబర్ కోడ్‌ల రద్దు, కార్మిక చట్టాల అమలుకు డిమాండ్
- పాల్గొన్న సీపీఎం, కాంగ్రెస్,. వైసీపీ, సీపీఐ పలు కార్మిక సంఘాలు



ప్రదర్శన నిర్వహిస్తున్న పలు కార్మిక సంఘాలు

నెల్లూరు (వైద్యం), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత కార్మిక సంఘాల సమ్మె పిలుపు మేరకు నెల్లూరు నగరంలో పలు కార్మిక సంఘా లు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఈ సార్వత్రిక సమ్మెలో పెద్ద సంఖ్యలో కార్మికులు కదం తొక్కారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. ఏబీఎం కాంపౌండ్ నుంచి మద్రాసు బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వర రావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యద ర్శి అజయ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్, ఐఎఫ్‌టీ యూ నాయకుడు సాగర్, ఏఐఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు యానాదయ్య ప్రసంగించారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలని కోరారు. జీవో నెంబర్ 21ని రద్దు చేసి 10 గంటల పనివిధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు జయకుమార్ రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కొండాప్రసాద్, పెంచలనర్సయ్య, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, ఆర్ శ్రీనివాసులు, మూలం ప్రసాద్, సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ఏఐటీయుసీ నాయకుడు బసవ రాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు మల్లికార్జున రెడ్డి, సునీత పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కి సన్మానం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరుకి వెళ్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కావలి సమీపంలోని ముసునూరు వద్ద ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తాతపూడి లాబాన్, నూనె ప్రసాద్, నందిపాటి ఆరోన్, సుకుమార్, కొనిగిపోగు వెంగయ్య, బక్కా ఆంథోని పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9233
వెండి కిలో ధర	రూ. 110200
వెండి ఒక గ్రాము	రూ. 113.20

నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు, కార్మికులు

ఆత్మకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నాలుగు కార్మిక కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, అ సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్కీమ్ వర్కర్లకు రూ. 26,000 కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరులో కార్మిక సంఘాల నేతలు, కార్మికులు నినాదాలతో హోరెత్తించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి పట్టణ రహదారి వెంబడి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ నాయకులు జీ. శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మికుల చట్టాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు ఆత్మకూరు నాగయ్య, కే. డేవిడ్‌రాజు, పీ. రాధమ్మ, వీ. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏపీ రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం అంగన్‌వాడీలు, వీఏఆర్‌లు, రైతు కూలీలతో కలిసి పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ నిరసన తెలిపి, తహసీల్దారు రాంమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ, ఆశా కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **మర్రిపాడు :** లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు.

● **వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమంలో నాయకులు మట్టె హరినారాయణ, షేక్ రజియా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **చేజర్ల :** చేజర్లలో బుధ వారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన చేపట్టారు.అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి అందించారు.

● **ఏఎస్‌పేట :** కార్మికుల హక్కుల కోసం బుధవారం ఏఎస్‌పేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిసార్,నాయకులు గంట లక్ష్మీపతి, సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

● **సంగం :** తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు, వీఆర్‌ఏలు బుధవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులతోపాటు వీఆర్‌ఏ సంఘం నాయకులు పాల్గొన్నారు.

హైవేపై అంధకారం

● జాతీయ రహదారుల జంక్షన్లలో వెలగని వీధిలైట్లు
● అవస్థలు పడుతున్న వాహనదారులు

ఉదయగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల జంక్షన్ల వద్ద రాత్రయితే చాలు అంధకారం రాజ్యమేలుతోంది. 167-బీజీ జాతీయ రహదారి దుత్తలూరు-ఉదయగిరి-సీతారామపురం రహదారి నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇటీవల ప్రధాని మోదీ ఈ రహదారిని వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే జంక్షన్లలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రిళ్లు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. అలాగే సీతారామపురం మండలం మీదుగా వెళుతున్న 167-బీ జాతీయ రహదారి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల మీదుగా వెళుతున్న 565 జాతీయ రహదారి గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కొన్నినెలలుగా పనిచేయడంలేదు. కూడలి, గ్రామాల ప్రాంతాల్లో సరైన వెలుతురు లేక వాహనదారులు మూగజీవాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కూడలి వద్ద దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.





ఉదయగిరిలోని 167-బీజీ జాతీయ రహదారి కూడలి వద్ద పనిచేయని విద్యుత్ దీపాలు, దుత్తలూరు 565 జాతీయ రహదారిపై నెలకొన్న అంధకారం

సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల వినతి



దుత్తలూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

ఉదయగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం మండలంలోని వీఆర్‌ఏలు తహసీల్దారు రాంమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. రెవెన్యూ గ్రామాల్లో జరిగే భూ రీసర్వేలో పాల్గొంటున్న వీఆర్‌ఏలకు టీఏ, డీఏలు చెల్లించాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు దుగ్గయ్య, వీఆర్‌ఏలు లింగయ్య, శేషయ్య, హజరత్, శ్రీనివాసులు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరులో: తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట మండలంలోని వీఆర్‌ఏలు నినాదాలతో కూడిన నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు తుపాకుల రమణయ్య, కార్యదర్శి ప్రభాకర్, జనరల్ సెక్రటరీ మురళి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

సీతారామపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని డాక్టర్ స్వప్న రెడ్డి అన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా ఆమె బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి షేక్ గాజుల నౌషద్‌బాబు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు మజీద్ ,నౌషాద్, పీహెచ్‌సీ సిబ్బంది శేఖర్‌రాజు, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ఎస్‌ఐ తనిఖీలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): సేఫ్ జోన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎస్‌ఐ రఘునాథ్ పాఠశాల సమీపంలోని దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల పరిధిలోని దుకాణాల్లో సిగరెట్, గుట్కాలు వంటి మత్తు కలిగించే పొగాకు ఉత్పత్తులను ఎట్టి పరిస్థితుల్లోను విక్రయించకూడదన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

ఉదయగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సమీపాన పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణాలపై బుధవారం ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించి జరిమానాలు విధించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, హోలీఏంజల్స్ సెయింట్‌మేరీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు.

గంధమహోత్సవం గోడపత్రిక ఆవిష్కరణ

అనంతసాగరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామంలో వెలసి ఉన్న కరిముల్లా సాఖాదరి దర్గా 132వ గంధమహోత్సవ గోడపత్రికను మసీదు ముత్తవల్లి బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 15 నుంచి 17 వరకు గంధమహోత్సవ వేడుకలు జరుగుతాయని, 16న ఖవ్వాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాపూరు సుజాత, స్థానిక నాయకులు ఖాసింబాషా, మనోజ్‌రెడ్డి, రాపూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం బీఎల్వోలకు శిక్షణ ఇచ్చారు. డీటీ చెంచయ్య మాట్లాడుతూ నిర్దీత వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు అవకాశం కల్పించాలన్నారు. ప్పటికప్పుడు నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు సలీం, వెంకటేశ్వర్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి

ఉదయగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ నాయకులకు మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఆనవాయితీ మారిందని, ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తి ఓ మహిళ పట్ల అసభ్యకరంగా మాట్లాడడం దారుణమన్నారు.

నేడు సాయిబాబాకు ప్రత్యేక పూజలు

సీతారామపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి సందర్భంగా గురువారం గ్రామంలోని శ్రీబాల త్రిపుర సుందరి యోగానంద ఆశ్రమంలో సాయిబాబాకు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నన్నయబట్టు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

సంగం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజనసంఘంలో జనసేన నాయకులు రెండు నిరుపేద కుటుంబాలకు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భానుకిరణ్, హరీష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు సరికాదు..

● రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

నెల్లూరు(హరనాథపురం), జూలై 9(ఆంధ్రజ్యోతి) : సభ్యసమాజం తలదించుకునేలా మహిళలపై వ్యాఖ్యలు చేయటం సరికాదని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసానికి వెళ్లి ఆమెకు సంఘీభావం తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతిరెడ్డిపై కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు ఛీదరించుకుంటున్నారని చెప్పారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ మహిళల గురించి దారుణంగా మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీగా పోటీ చేసి డిపాజిట్ దక్కని అనిల్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కాగా, ప్రసన్న వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివ సంఘీభావం తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ



సంగం : మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్ తదితరులు

ఉదయగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం పంచాయతీల అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అప్పాజీ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ ఇండెక్స్ పోర్టల్లో 2.0 వెర్షన్ ద్వారా అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల పురోగతిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయితీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ జరిగింది. ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్ మాట్లాడుతూ 2023-24 సంబంధించి గ్రామాల్లో చేపట్టిన పనులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివప్రసాద్ పాల్గొన్నారు.

●సీతారామపురం, (ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు బుధవారం తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు మమత,ఆదిలక్ష్మి, సుహాసిని, బేబీషాలిని, రాజకుమారి పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరిరూరల్), (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతిపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతి సూచికపై మండల అధికారులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

●ఏఎస్‌పేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ పురోగతి సూచికలపై ఎంపీడీవో ప్రసన్నకుమారి మండలస్థాయి అధికారులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మజారెడ్డి, మండల అధికారులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవుడికి హనుమంతసేవ

సంగం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడులో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం అర్ధరాత్రి స్వామివారికి హనుమంతసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను హనుమంతుడి విగ్రహంపై గ్రామోత్సవం నిర్వహించారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

బిట్రగుంట, జూలై 9(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని కొడవలూరు- పడుగుపాడు రైల్వే స్టేషన్ల మధ్య దిగువ మార్గం 184/12-14 కిలోమీటర్ల వద్ద రైలు పట్టాలపై (50) గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహం ఉన్న పరిస్థితిని బట్టి ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు బిస్కెట్ రంగు ఫుల్ చొక్కా, కాఫీ కలర్ లుంగీపై నలుపు, తెలుపు నిలువు గీతలు, నల్లని నిక్కర్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై సుబ్బయ్య అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు జీఆర్పీ ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

ఉపాధ్యాయినిపై ప్రధానోపాధ్యాయుడి దాడి

దగదర్తి(బిట్రగుంట), జూలై 9(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కట్టుబడిపాలెం జడ్పీ హైస్కూలో పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయినిపై అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడి చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉన్నత పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయిని బదిలీకి సంబంధించి రిపోర్టుల విషయంలో ఈనెల 7వ తేదీన ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావుతో ఆమెకు వివాదం జరిగింది. ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ మేరకు ఇద్దరూ ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఈ విషయమై స్థానికంగా విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జంపానికుమార్ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు

సంగం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసూయ నగర్‌లో బుధవారం 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి భానుచంద్రకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, అల్లూరు మండలం వీరారెడ్డిపాళెంకి చెందిన యువకుడు భానుచంద్ర అనుసూయనగర్ పెన్నానది ఒడ్డున ఉన్న పొలాలను లీజుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగిలి సరఫరాకు తరుచుగా అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ట్రాన్స్‌కో అధికారులకు తెలియకుండా భానుచంద్ర ఎల్‌సీ తీసుకోకుండా చెట్టు కొమ్మలను కొట్టే క్రమంలో సమీపంలో ఉండే 11 కేవీ విద్యుత్ లైను తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయలపాలయ్యాడు. గుర్తించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. అనంతర భానుచంద్రను 108 వాహనంలో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం చెన్నైకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరీ దిమ్మె కూలి ఒకరి మృతి

● మరొకరికి గాయాలు



సంఘటనా స్థలంలో తాతా వెంకయ్య మృతదేహం

కావలిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రహరీ గోడ గేటు దిమ్మె కూలి ఒక కూలీ మృతి చెందగా మరో కూలీకి గాయాలైన ఘటన కావలి పట్టణం లోని 8వ వార్డు చింతంవారివీధిలో బుధవారం జరిగింది. 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. చింతంవారివీధిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మురుగు నీటి కాలువ ఏర్పాటుకు ఎక్స్‌కవేటర్‌తో కాలువ తవ్వుతుండగా కొందరు కూలీలు కాలువలో మట్టిని తీయ్యసాగారు. ఈ క్రమంలో అక్కడ ఒక ఇంటి పాత ప్రహరీ గోడ దిమ్మె కూలి ప్రమాదవశాత్తు కూలీలపై పడింది. ఈ ఘటనలో బోగోలు మండలం సాంబశివపురంకు చెందిన వెంకయ్య(55) తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వైకుంఠపురంకు చెందిన మరో కూలీ మహాబూబ్‌బాషాకు గాయాలయ్యాయి. వారి పక్కనే ఉన్న మరో ఇద్దరు కూలీలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మృతుడికి భార్య ఆదెమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సుమన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

● ముసునూరులో పలు దుకాణాల్లో ఎస్‌ఐ తనిఖీ



ముసునూరులోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తిరుమలరెడ్డి

కావలిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, పాఠశాలల సమీపంలో వంద మీటర్ల వరకు దుకాణాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు సిగరెట్లు, బీడీలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి రూరల్ ఎస్‌ఐ తిరుమలరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ముసునూరులో పలు ఆలయాలకు సమీపంలో ఉన్న దుకాణాల్లో బుధవారం రాత్రి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాలు, పాఠశాలలకు సమీపంలో ఉన్న దుకాణాలపై నిఘా ఉంచామన్నారు. ఆయా దుకాణాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులైన గుట్కాలు, ఖైనీలతో పాటు సిగిరెట్లు కూడా విక్రయించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి, పత్తుపదార్థాలపై నిఘా

కావలి మండలంలోని గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాల వినియోగం, విక్రయంపై గట్టి నిఘా పెట్టామని సీఐ రాజేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిషేధిత వస్తువుల విక్రయం, ఎవ్వరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లయితే రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వైసీపీ నేతల దాడి

పొదలకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలోని టీడీపీ నాయకుడు సీతారామ నాయుడు, ఆయన కుమార్తె ప్రమీలమ్మ, మనుమడు శరత్‌చంద్ర, మనుమరాలు దాక్షాయనీలపై వైసీపీ నాయకులు కోదండయ్య, ధనుంజయలు దాడి చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఆస్తుల విషయంలో గొడవ చెలరేగడంతో కోదం డయ్య, ధనుంజయలు బంధువైన ప్రమీలమ్మను కొట్టి గాయపరచడంతో ఆమె చేతి వేలు విరగగా మిగిలినవారికి గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఏఎన్యూ దూరవిద్య పరీక్షలు

పెదకాకాని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ, డిప్లమా, సర్టిఫికెట్ ప్రోగ్రాం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వీ. వెంకటేశ్వర్లు, దూర విద్యా పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డీ. రామచంద్రన్ తెలిపారు. పరీక్షలు ఆగస్టు ఏడో తేదీ వరకు కొనసాగుతాయన్నారు. సెమిస్టర్ విధానంతో పాటు, వార్షిక, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

జగన్ లక్షణాలను పుణికి పుచ్చుకున్న వైసీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ లక్షణాలను ఆపార్టీ నేతలు పుణికిపుచ్చుకున్నారని, ఇందుకు నిదర్శం కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్న ఉదంతమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళల పట్ల అగౌరవంగా ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నుంచి కింది స్థాయి నాయకత్వం వరకు మహిళలను కించపరచడం, అగౌరవపరచడం వారి నైజమని తెలిపారు. ప్రసన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాకర్ల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడా నర్సారెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, ఆనంగి రమణయ్య, కోడూరు నాగిరెడ్డి, జూపల్లి రాజారావు, జనసేన నేతలు బండారు సత్యనారాయణ, వసంత, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిరైతుకు అన్నదాత సుఖీభవ అందచేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఏరుకొల్లు, బోడవారిపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అర్హుల జాబిత రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. జాబితాలో పేరు లేకపోతే ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఏవో సుస్మిత, వీఏఏలు దినేష్, ఫజియా, రైతులు పాల్గొన్నారు.

●చేజర్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపాడు, చేజర్ల గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారి పీ.హిమబిందు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

● కలువాయి, (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు ఈనెల 13లోపు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చల్లా కళారాణి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 550

సాయినాథుడికి లక్ష మల్లెలార్చన

కావలి(టౌన్): ముసునూరు మందాటి చెరువు వద్ద ఉన్న శ్రీసాయి క్షేత్రంలో జరుగుతున్న గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా బుధవారం సాయినాథుడికి సమూహిక లక్షమల్లెల అర్చన పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, మంగళధ్వని, గోపూజ, తులసి పూజలు జరిగాయి. అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సంధ్యాహారతి అనంతరం మహిళా భక్తులచే సామూహిక లక్షమల్లెల అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు పొట్టేపాలెం నాగేశ్వరరావు తెలిపారు.



న్యూస్ బాక్స్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు సత్కారం

కావలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను బుధవారం విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు రామిరెడ్డి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ పట్ల ప్రజలను ఆకర్షితులను చేసేందుకు కావలిలో తగిన ప్రచారం చేపడతానన్నారు.

బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల సంఘం- ఇండియా ఇంటర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసి అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. బుధవారం మొదటి బ్యాచ్ వలేటివారిపాలెం మండలంకు సంబంధించి 46 మందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ట్రైనర్లుగా బీ కృష్ణవేణి, సీహెచ్ సునీల్‌రెడ్డి బాధ్యత వహించగా, కందుకూరు నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వీ లావణ్య, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కావలి రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎస్. బెనర్జీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ జడ్జి ఎ.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు జి. మధుకుమార్, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు. కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు పాల్గొని దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కరింకోవచ్చని పేర్కొన్నారు.

నేడు కరేడుకు సీపీఐ రామకృష్ణ రాక

కందుకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ గురువారం కరేడు గ్రామంలో పర్యటించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పీ మాలకొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కందుకూరు నుంచి కరేడు వరకు యువజన, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో మధ్యాహ్నం 1 గంటకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభం

కలిగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక సాయిబాబా మందిరంలో బుధవారం వేద పండితులు పున్నవజ్జల శేషసాయి ఆధ్వర్యం లో గురుపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి జరిగిన పాలభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కరేడులో బలవంతపు భూసేకరణ అపాలి

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కరేడులో రైతుల అభీష్టానికి భిన్నంగా జరుగుతున్న బలవంతపు భూసేకణ ఆపాలని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చారి బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. బుధవారం ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం బెల్టు షాపులు, కల్తీ మందుల తయారీ కేంద్రంగా మారిందని, రేషన్ మాఫియాలో స్థానిక ఎమ్మెల్యేకు వాటా ఉందని, నియోజకవర్గంలో ప్రతి పనికి కప్పం కట్టమని హుకుం జారీ చేస్తున్నారని విమర్శించారు. కరేడు రైతుల పోరాటానికి వైసీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

గుడ్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలో గురువారం ఉదయం 10 గంటలకు జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయుడు పీవీ రాంమోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత చర్యలను గురించి ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. కనుక ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పక హాజరుకోవాలని పేర్కొన్నారు.

వన్యప్రాణులకు రక్షణ కరువు!



రైల్వే ప్రాంతంలో సంచరిస్తున్న చుక్కల దుప్పులు

- అంతరిస్తున్న అటవీ ప్రాంతం
- ఆహారం, తాగునీరు కరువు
- జనారణ్యంలోకి చుక్కల దుప్పులు, జింకలు
- బిట్రగుంట రైల్వేస్టేషన్ ప్రాంతంలో సంచారం
- రైలు ఢీకొని, కుక్కల దాడిలో మృత్యువాత

బిట్రగుంట, జూలై 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో సహజ సిద్ధమైన అటవీ ప్రాంతం రోజురోజుకి అంతరించిపోతోంది. అటవీ శాఖ అధికారులే అడవుల్లో జామాయిల్, నేరేడు, చందనం, కానుగ తదితర మొక్కలు నాటి పెంపకం చేపడతున్నారు. దీంతో మరుగు లేక వన్యప్రాణులకు రక్షణ కరువైంది. వాటికి కావాల్సిన ఆహారం, తాగునీరు దొరకక జీవన విధానం కష్టతరంగా మారుతోంది. దీనితో విధి లేని పరిస్థితుల్లో వన్యప్రాణులు జనారణ్యంలోకి పరుగులు తీస్తున్నాయి. ఇలా వచ్చిన చుక్కల దుప్పులు, జింకలు కుక్కల దాడిలో, రైలు, రోడ్డు ప్రామాదాల్లో మృత్యువాత పడుతోన్నాయి. బోగోలు పంచాయతీ అక్కరాజువారి కండ్రిక, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు, నాగులవరం, తాళ్లూరు, సుందరగిరివారికండ్రిక పంచాయతీల శివారు ప్రాంతాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వలన ఆయా గ్రామాల్లోకి తరచూ జింకలు, చుక్కల దుప్పులు చొరబడుతోన్నాయి. అలాగే బిట్రగుంట రైల్వే లోకోషెడ్, కోల్‌యార్డ్ ఉన్న సమయంలో రైల్వే కార్మికుల కోసం క్వార్టర్స్, కాలనీ ఇళ్లు, అధికారులకు బంగళాలు ఉండేవి. కాలా నుగుణంగా జరిగిన మార్పులు రావడంతో కార్మికుల సంఖ్య తగ్గిపోయింది. రైల్వే క్వార్టర్సుకు కాలం చెల్లి శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉ న్న కొన్ని ఇళ్లు, బంగళాలు, కార్యాలయాలను తొలగించారు. దీంతో బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు తూర్పు, పడమర ప్రాంతాల్లోని రైల్వే శిథిల భవనాల్లో ముళ్లచెట్లు మొలిచి అడవులను తలపిస్తుండడంతో ఈ ప్రాంతంలో కొంత మరుగు ఏర్పడింది. దీంతో వన్యప్రాణులు నిత్యం అధిక సంఖ్యలో ఇక్కడ సంచరించడం వల్ల ఈ ప్రాంతం వాటికి ఆవాసాలుగా మారింది. ఈ ప్రాంతాల్లో సంచరించే జింకలు, దుప్పులను పసిగట్టిన కుక్కలు దాడిచేసి చంపేస్తున్నాయి. వీటి నుంచి తప్పించుకునే క్రమంలో కొన్ని రైలు పట్టాలపైకి పరుగులు తీసి రైలు ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నాయి. రైలు పట్టాలకు తూర్పున కోవూరుపల్లి చెరువు, కడనూతల చెరువులు ఉం డటం వలన నీటికోసం రైలుపట్టాలు దాటుతూ కూడా మరికొన్ని మృతి చెందుతోన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి అటవీ ప్రాంతంలో తాగునీ వసతులు కల్పిస్తే వన్యప్రాణులు జనారణ్యంలోకి వచ్చే అవకాశం ఉండదు. తద్వారా రోడ్డు, రైలు ప్రామాదాలతో పాటు కుక్కల దాడి నుంచి వాటికి రక్షణ కల్పించవచ్చని ప్రజలు, జంతు ప్రేమికులుఅంటున్నారు. ఇందుకు సంబంధిత అధికారులు ఏ మాత్రం చర్యలు చేపడుతారో వేసి చూడాల్సిందే.



రైలు ఢీకొని మృతి చెందిన చుక్కల దుప్పి(ఫైల్)

సార్వత్రిక సమ్మె విజయవంతం



లింగసముద్రం : ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

కావలి(టౌన్), జూలై 9(ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో జరిగిన సార్వత్రిక సమ్మె విజయవంతం అయింది. ట్రంకురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకురాలు ఎస్‌కె రెహానా బేగం, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు దామా అంకయ్యలు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకురావడం కార్మికుల గొంతు కోయడమేనన్నారు. నల్ల చట్టాలతో కార్మికులు ప్రశ్నించే పోరాడే హక్కు కూడా కోల్పోయే ప్రమాదముందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి కార్మికుల కుటుంబాలను వీదులపాలు చేసి అదాని అంబానీల కుటుంబాలకు ప్రయోజనాలు చేకూర్చుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు లక్ష్మారెడ్డి, పసుపులేటి పెంచలయ్య, కృష్ణమోహన్, నాగరాజు, మల్లె అంకయ్య, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు** : స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. తొలుత ప్రధాన రహదారి వెంట ర్యాలీ నిర్వహించారు. పీటీపీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్, ఇందిరావతి, అంగన్‌వాడీ, పీటీపీ వర్కర్లు, ఆశా, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం** : అంగన్వాడీలకు ప్రభుత్వం కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండలంలోని 44 అంగన్వాడీ కేంద్రాలను మూసివేసి వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు అంగన్వాడీలు సీఐటీయు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కార్యాలయ జూనియర్ అసిస్టెంటు సాహిత్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు బి.మార్తమ్మ, పి.శైలజ, ఎస్‌కె పరీమా, కె.సుగుణ, పి.శ్రీదేవి, ప్రమీల, సీహెచ్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

● **గుడ్లూరు** : కార్మికులను వీధులపాలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గుడ్లూరులో సీఐటీయు, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలో 60 మంది అంగన్‌వాడి కార్యకర్తలు కేంద్రాలను మూసివేసి పాల్గొన్నారు. వీఆర్‌ఏలు, యునైటెడ్ ఎలక్ట్రికల్ యూనియన్, భవననిర్మాణ కార్మికులు, మహిళాసంఘం, తదితర ప్రజాసంఘాలు సమ్మెకు సంఘీభావం తెలిపారు. రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించిన అనంతరం, బస్టాండ్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు దామా కృష్ణయ్య, కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, కొట్టే పులయ్య, ఎస్.కే పద్మజ, షరీఫ్, అక్కిలగుంట జార్జీ, తదితరులు పాల్గొన్నారు.

● **కలిగిరి** : సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల్లా తమకు అన్ని సౌకర్యాలు వర్తింపజేయాలని కోరుతూ ఎంపీపీ మెట్టుకూరు శిరీషకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



ఉలవపాడు : నిరసన తెలుపుతున్న సీఐటీయూ కార్మికులు, అనుబంధ సంఘాల నేతలు



వలేటివారిపాలెం : తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు



అల్లూరు : తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు



బిట్రగుంట : తిప్ప రోడ్డులో నిరసనలు చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నేతలు



గుడ్లూరు : తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

● **వలేటివారిపాలెం** : అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు జిల్లా నాయకులు కుమార్ కోరారు. సీఐటీయు నాయకులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలు మండలంలో సీఐటీయూ, సీపీఎం నేతల ఆధ్వర్యంలో వివిధ కార్మికసంఘాలు సార్వత్రిక సమ్మెను నిర్వహించారు. ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయం నుంచి తిప్ప జాతీయరహదారి మీదుగా తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంలకు వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, సీపీఎం సీనియర్‌నేత తుమ్మల వెంకయ్య, నేతలు బాదుల్లా, బీ.రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● **అల్లూరు** : కేంద్ర ప్రభుత్వం కార్మికులు, కర్షకులకు హానికలిగించే విధంగా కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలో భాగంగా స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచుపాటి విజయలక్ష్మి, షేక్ రషీద్, మాలపాటి వెంకయ్య, వెంకట రమణమ్మ, సౌజన్య, రమణమ్మ, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు

వలేటివారిపాలెం, జూలై 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యాధికారి శివసిద్ధప్ప తెలిపారు. పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకంలో భాగంగా గర్భిణులకు సాధారణ పరీక్షలు, రక్తపరీక్షలు, యూరిన్, షుగర్, బీపీ, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకుంటే జననీ యోజన పథకం కింద రూ.1000 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల పోరాటానికి మద్దతుగా నిలవాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కరేడులో చేస్తున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో సీపీఎం శ్రేణులు అందరు ప్రత్యక్షంగా పాల్గొనాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కందుకూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరేడులో అన్ని ప్రాంతాల్లో తిరిగి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని అన్ని వర్గాల ప్రజలకు వివరించి వారిలో చైతన్యం నింపి ఉద్యమాన్ని బలపరిచాలని, ఇండోసోల్ కరేడును వదిలి వెళ్లే వరకు పోరుబాటలో నిలవాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు చేసిన కృషితో సంతృప్తి పడకుండా నిరంతరం రైతుల కష్టసుఖాల్లో భాగసామ్యులు కావాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా నేత ముప్పరాజు కోటయ్య, ఉలవపాడు, గుడ్లూరు, కందుకూరు ప్రాంతీయ కార్యదర్శులు కుమార్, గౌస్‌బాషా, మాదాల రమణయ్య, దువ్వూరి జాన్ పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ



అల్లూరు : శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ

అల్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పురోగతి ప్రణాళికపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సచివాలయాల సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రజనీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, ఎస్ఐఆర్‌డీ పరిశీలకులు ప్రసాద్, జిల్లా శిక్షకులు శివ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు ఈ శిక్షణలలో పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : మండల అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ జహీర్, పురిణి శ్రీనివాసులు, ఏ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం** : పంచాయతీ అభివృద్ధికి చేపట్టవలసిన ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికొరకు పురోగతి సూచిక (అడ్వాన్స్‌డ్ ఇండెక్స్) అనే నూతన కార్యక్రమం చేపట్టిందన్నారు. పంచాయతీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, సాధించవలసిన లక్ష్యాలపై సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. పంచాయతీలలో రోజువారీ జరిగే కార్యక్రమాలను ఈగ్రామ్ స్వరాజ్ యాప్ నందు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమం ప్రారంభించేముందుగా మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్, ఏవో శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలు సంతృప్తి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కరపత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని టిక్కలిపాలెం, వెంకటనారాయణ బజార్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం పథకాలు అందుతున్నాయా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా తన దృష్టికి తీసుకురావాలని అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసులు, చదలవాడ కొండయ్య, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు బుద్ధిరాలేదు

రాష్ట్రంలో అరాచకపాలనతో ఐదేళ్ల ప్రభుత్వాన్ని నడిపిన వైసీపీని ప్రజలు ఛీత్కరించుకున్నా వారికి బుద్ధి రాలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడితే వైసీపీ అధినేత ఆ పార్టీ ముఖ్యనాయకులు ఖండించకపోగా మాజీ మంత్రి అనీల్ ప్రసన్నకు మద్దతుగా అదే భాషలో మాట్లాడటం ఆ పార్టీ నేతల స్థాయిని సంస్కారాన్ని తెలుపుతోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జనగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, కృష్ణారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో ఇంటింటికి..

గుడ్లూరు : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాయుడుపాలెంలో బుధవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికార్జున, మాజీ మండల అధ్యక్షుడు మేకల మాల్యాద్రి, నాయకులు వీరంరాజు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'తొలిఅడుగు'

వలేటివారిపాలెం : మండలంలోని చుండి, గరుకుపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ శ్రీనివాసులు, శనివారపు మాల్యాద్రి, శనివారపు మాల్యాద్రి, లింగాలదెన్నె వెంకటేశ్వర్లు, కామినేని అశోక్, మేకల అశోక్, కామినేని వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కలిగిరి మండల సమావేశం

● పలువురు అధికారులు, సభ్యులు డుమ్మా

కలిగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశానికి విద్యుత్, వైద్యం, ఆర్టీసీ, అటవీ తదితర శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడంతో ఎంపీపీ శిరీష అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖాధికారుల నుంచి వివరణ తీసుకొని నివేదికను జిల్లా కలెక్టరుకు పంపాలని ఎంపీడీవో ప్రత్యూషకు సూచించారు. అదేవిధంగా గత ఆరు నెలలుగా రెవెన్యూ శాఖలో రైతులకు పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోయామని, అప్పటి తహసీల్దారు రిటైర్ కావడం వలన ప్రస్తుతం డీటీ గిరీష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారని, భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి రావచ్చని సీనియర్ అసిస్టెంట్ రంతుల్లా తెలిపారు. కలిగిరి మోడల్‌స్కూల్‌లో ఇతరప్రాంతాల విద్యార్థులకు సీట్లు కేటాయించడంతో స్థానిక విద్యార్థులు నష్టపోతున్నారని కావలిముస్తాపురం సర్పంచు పోలవరపు సుబ్బానాయుడు ఎంఈవో సురేష్‌కు సూచించారు.. స్థానిక పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందించడానికి ఇద్దరు వైద్యులను నియమించినప్పటికీ ఒక్కరు మాత్రమే విధుల్లో ఉంటూ మరొకరు సంతకాలు పెట్టి వెళ్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీపీని కోరారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రసన్న క్షమాపణ చెప్పాలి

కావలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరుస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఆమెకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ నేతలు డిమాండ్ చేశారు. కావలి జర్నలిస్టుక్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ సుధీర్, నియోజకవర్గ అధికారప్రతినిధి మన్నేపల్లి రుషికేష్, వీర మహిళ కొప్పుల లక్ష్మీలు ప్రసన్న చేసిన వాఖ్యలను ఖండించారు. వైసీపీ నాయకులు ఇదే విధంగా మహిళల పట్ల అనుచితంగా నోటికి వచ్చినట్లు మాట్లాడమని, ఆ పార్టీ అధిష్ఠానం వారికి ఇదే నేర్పిస్తున్నట్లుందన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి పవన్‌కల్యాణ్ భార్య, ఆయన వ్యక్తిగత జీవితంపై మాట్లాడారని అదే వైఖరిని ఈ రోజు వైసీపీ నాయకులు అవలంభిస్తున్నారని చెప్పారు. ప్రసన్న కుమార్‌రెడ్డితో పాటు ఆయనకు మద్దతుగా నిలిచిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తదితర నాయకులందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాదు శ్రీధర్, బెల్లంకొండ మస్తాన్, బాలు వెంకయ్య, వీరమహిళలు ప్రసన్న, యామిని, జయలక్ష్మీ, పద్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

జగన్నాటకం

● మామిడి రైతుల పరామర్శ పేరుతో డ్రామాలు

ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి



సీన్ 1

హెలికాప్టర్ దిగి మార్కెట్ యార్డుకు బయలు దేరిన జగన్ దారి మళ్లించారు. కారణం హైవే మీద జనం జాడ పెద్దగా లేకపోవడం. బంగారుపాళ్యం పట్టణంలో అయితే ట్రాఫిక్ స్తంభించి జనం ఉన్నట్టుగా కనిపిస్తారు. పోలీసు అధికారులు అనుమతించకపోవడంతో అరగంట వాదించారు. ఎస్పీపై ఆగ్రహం ప్రకటించారు.

సీన్ 2

జగన్ కాన్వాయ్ దగ్గరకు వస్తుండగా వైసీపీ మాజీ సర్పంచి ప్రకాష్‌రెడ్డి తోటలోంచి హఠాత్తుగా ఐదు ట్రాక్టర్లు బయటకు వచ్చాయి. ముందే వాటిని తోతాపురి మామిడి కాయలతో నింపి అక్కడ దాచి ఉంచారు. కాన్వాయ్‌కి ముందు రోడ్డంతా కాయలు పోసుకుంటూ ట్రాక్టర్లు వెళ్లాయి. రైతు కష్టంతో పండిన కాయల్ని తొక్కుకుంటూ జగన్ కాన్వాయ్ ముందుకు దూసుకుపోయింది.



సీన్ 3

బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో వైసీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. పోలీసుల ఆదేశాల్ని ఖాతరు చేయకుండా మూసి ఉన్న ప్రధాన గేటును తోసుకుంటూ యార్డులోకి ప్రవేశించారు. మండీల్లోని మామిడి కాయల్ని తొక్కి ధ్వంసం చేశారు. మార్కెట్‌లో షెడ్లపైకి ఎక్కి హల్‌చల్ చేశారు. బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో రైతులు ఎవ్వరూ కనిపించ లేదు. మొత్తం వైసీపీ నాయకులు, కార్యకర్తలే తమ స్వాధీనంలోకి తీసుకున్నారు.

సీన్ 4

ముందే ఎంపిక చేసి రిహార్సల్ చేసుకున్న మండీలోకి జగన్ వెళ్లారు. ఎంపిక చేసుకున్న రైతులతో కాసేపు ముచ్చటించారు. అరగంటకే అక్కడి నుంచి వెనుదిరిగారు.

రైతు కష్టాల్లో ఉంటే నాయకుడు ఏం చేయాలి?

కష్టాల్లో ఉన్నపుడే వచ్చి పలకరించాలి. కన్నీరు తుడవాలి. కారణాలు కనుక్కోవాలి. ధైర్యం చెప్పాలి. భరోసా ఇవ్వాలి. అధికారంలో ఉంటే - రైతును గట్టెక్కించే చర్యలు తీసుకోవాలి. విపక్షంలోఉంటే- ఏం చేస్తే రైతులకు మేలు జరుగుతుందో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి. ప్రభుత్వం కదలకపోతే.. కదిలేదాకా రైతులతో కలిసి పోరాడాలి.

మరి జగన్‌రెడ్డి ఏం చేశారు?

చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ ముగిసే వేళకి మండీకి వచ్చారు. రైతుల కష్టాలు వినకుండా తన సహజ ధోరణిలో ఉపన్యాసం ఇచ్చారు. మందీమార్బలంతో రెండు గంటలకు పైగా రోడ్డుమీద షో చేసి, అసలు కార్యక్రమంలో అరగంట కూడా ఉండకుండానే హెలికాప్టర్ ఎక్కి ఎగిరి వెళ్లిపోయారు. జగనన్న పర్యటనలో తమ్ముళ్లు రెచ్చిపోయారు. రోడ్లమీదా, మార్కెట్ యార్డు వద్దా నానా బీభత్సం సృష్టించారు. జనాన్ని భయభ్రాంతుల్ని చేసి, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ని చుట్టుముట్టి పిడిగుద్దులు కురిపించి అధికారంలో ఉన్నా లేకున్నా.. మేం మారం ఇంతే అని ప్రకటించుకున్నారు. బంగారుపాళ్యంలో బుధవారం జగన్‌రెడ్డి పర్యటన సందర్భంగా జరిగిన పరిణామాల పరంపర ఇది...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఉదయం 5గంటలు: హైవే, గ్రామీణ ప్రాంతాల నుంచి బంగారుపాళ్యం వచ్చే దారుల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఒరిగి పల్లె, మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద నుంచే తనిఖీలు మొదలు పెట్టారు.

ఉదయం 9.00: వైసీపీ కార్యకర్తలు చెక్‌పోస్టుల గుండా కాకుండా రకరకాల దారుల్లో హెలిప్యాడ్ వద్దకు, మార్కెట్ యార్డు దగ్గరకు చేరుకున్నారు.రోడ్ల మీద బైకుల్లో దూసుకుపోతూ, రప్పా రప్పా నరుకుతామని అరుస్తూ హంగామా చేశారు.



రూట్ మార్చొద్దన్న ఎస్పీతో జగన్ వాగ్వాదం

10.30: వైసీపీ శ్రేణులు బంగారుపాళ్యం మార్కెట్‌యార్డు గేట్లను తోసుకుని లోపలికి వెళ్లారు. పోలీసులు చేతులెత్తేశారు.

11.20: జగన్ హెలికాప్టర్ వచ్చి వాలింది. అక్కడ 30 మందికి అనుమతిచ్చినా, 500 మంది లోపలికి చొచ్చుకుని వెళ్లిపోయారు.హెలిప్యాడ్ ప్రాంగణంలో 3 వేలమంది పోగయ్యారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసి అదుపు చేశారు.

11.30: ముందుగా వైసీపీ అనుమతి పొందిన మార్గంలో కాకుండా జగన్ కాన్వాయ్ దారి మళ్ళుతోందని తెలిసి చరణ్ దాబా వద్ద ఎస్పీ మణికంఠ జగన్ కాన్వాయ్‌ను అడ్డగించారు. ముందుగా అనుకున్నట్లు హైవే- నలగాంపల్లె ఫ్లైఓవర్ మీదుగా యార్డుకు రావాలని సూచించారు. జగన్ అంగీకరించలేదు. బంగారుపాళ్యం పట్టణంలో నుంచే వస్తానని జగన్ పట్టుపట్టారు. కొంత వాదన జరిగింది. ఎస్పీ ఉన్నా.. కారు ముందుకు పోనివ్వమంటూ డ్రైవర్‌కు జగన్ సూచించారు.

12.00: మరింతమంది పోలీసులతో, వాహనాలతో జగన్ కాన్వాయ్‌కు అడ్డుగా ఎస్పీ నిల్చున్నారు.దీంతో ముందుగా అనుకున్న రూట్ ప్రకారమే హైవే, నలగాంపల్లె ఫ్లైఓవర్ మీదుగా కాన్వాయ్ ప్రయాణం మొదలైంది.

12:30: జనం లేని రోడ్లపై అనుమతి లేకున్నా రోడ్‌షో చేశారు.

12:45: జగన్ రోడ్‌షో ముందుకు రాగానే వైసీపీ మాజీ సర్పంచి ప్రకాష్‌రెడ్డి తన తోటలో దాచి పెట్టుకున్న మామిడి కాయలున్న 5 ట్రాక్టర్లను రోడ్డుమీదకు నడిపించారు. వాటిని రోడ్డుమీద పారబోసుకుంటూ వెళ్లారు.జగన్ కాన్వాయ్, వైసీపీ శ్రేణులు అరుపులు.. ఈలలతో ఆ కాయల్ని తొక్కుకుంటూ ముందుకు సాగాయి.

1.20: బంగారుపాళ్యం పట్టణం పాలూరు క్రాస్ వద్ద కుప్పం వైసీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లోపలికి అనుమతించాలని దబాయించడంతో, పోలీసులు కూడా వారిని వదిలేశారు.

1.40: యార్డు గేటు నుంచి మండీలోకి వెళ్లే వరకు రోడ్‌షో చేసుకుంటూ జగన్ మార్కెట్ యార్డులోకి వచ్చారు.

1.50: ముందుగా ఎంపిక చేసిన మండీలోకి వెళ్లి, ముందుగా అనుకున్న రైతులతో కాసేపు మాట్లాడారు.

2.25: మండీ నుంచి హెలిప్యాడ్ వద్దకు జగన్ బయల్దేరారు.

2.45: హెలికాప్టర్ దుమ్ము మిగిల్చి.. బెంగళూరుకు ఎగిరి వెళ్లిపోయింది.

బతుకుతానని అనుకోలేదు


ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కార్యక్రమం కవర్ చేయడానికి మార్కెట్ యార్డులోని 22వ మండీ వద్దకు వెళ్లా. ఫొటోలు తీస్తున్నా. అంతలో అక్కడున్న కొందరు వీడు ఏబీఎన్ వాడు అంటూ అరిచారు. అంతే నామీద ఒక గుంపు పడిపోయారు. దాదాపు 15 మంది పైనే ఉంటారు. కెమెరా లాక్కుని పగలకొట్టేందుకు ప్రయత్నించారు. అక్కడే మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, విజయానందరెడ్డి ఉన్నారు. నేను వాళ్లకు తెలుసు. కాపాడతారని అటు పరుగు తీశా. అయినా గుంపు నన్ను విడిచిపెట్టలేదు. మరోసారి దాడి చేశారు. ఊపిరి ఆడలేదు. తల మీదా, వీపు మీదా పిడిగుద్దులు కురిపిస్తున్నారు. బట్టలు చింపి చిందరవందర చేశారు. ఇక అయిపోయింది అనుకున్నా. బతకను అనుకున్నా. ఎక్కడి లేనీ శక్తి తెచ్చుకుని నెట్టుకుంటూ ఆ మూకలోంచి బయట పడ్డా.

- శివకుమార్, ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పోలీసు వైఫల్యం

చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో పోలీసులు ముందుగానే జగన్ పర్యటనకు ఆంక్షలు విధించినా అమలు చేయడంలో దారుణంగా విఫలమయ్యారు. చెక్‌పోస్టులు పెట్టి ఆపారు గానీ, పొలాల్లోంచి వచ్చేవారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేకపోయారు. చెక్‌పోస్టుల వద్ద కూడా దబాయించి మాట్లాడితే వదిలేశారు. మామిడికాయలు రోడ్లమీద పోస్తారని ముందే తెలిసినా అడ్డుకోలేకపోవడం ఆశ్చర్యం. ఇదే జగన్ ప్రభుత్వంలో అయితే ఇలాగే వ్యవహరించి ఉండేవారా అని జనం మాట్లాడుకున్నారు. లోకేశ్ పాదయాత్ర కుప్పం నుంచి మొదలు పెట్టినపుడూ, చంద్రబాబు పర్యటనల్లోనూ పోలీసులు వ్యవహరించిన తీరు గుర్తు చేసుకున్నారు.



ఫొటోలు తీస్తే చంపేస్తారా?

రక్తం రుచిమరిగిన క్రూరమృగం ఎలా ప్రవర్తిస్తుందో వైసీపీ కార్యకర్తలు కూడా అలాగే ప్రవర్తిస్తున్నారు. వైసీపీ మూకలు దాడి చేస్తుంటే పక్కనే ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, విజయానందరెడ్డి దగ్గరకు ఆ ఫొటోగ్రాఫర్ వెళ్తే.. మనవాడు కాదని సైగ చేసి మానవత్వం లేకుండా వెళ్లిపోతారా? ఇదేమి దుర్మార్గం?

- మురళీ మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

ఎస్‌ఎస్ లింక్ కెనాల్

లిఫ్ట్ పనులకు మోక్షం

- తిరుపతిలో టీజీపీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి అనుమతి
- మామిడి మద్దతు ధరకు రూ.260 కోట్లు మంజూరు
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు



ఎస్ఎస్ లింక్ కెనాల్ (ఫైల్ ఫొటో)

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మేలు చేసే ఎస్ఎస్ లింక్ కెనాల్, మామిడి రైతులకు సబ్సిడీ చెల్లింపుతో పాటు తిరుపతిలో తెలుగుంగ ప్రాజెక్టు గెస్ట్‌హౌస్ నిర్మాణానికి సంబంధించి నిర్ణయాలను బుధవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం తీసుకుంది.

● జిల్లాలో ఆరున్నరేళ్లుగా పెండింగులో ఉన్న సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్ లిఫ్ట్ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ పనులకు 2019 జనవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.292.66 కోట్లకు పరిపాలనా మంజూరు లభించింది. హైదరాబాదుకు చెందిన మెస్సర్స్ ఎంఈఐఎల్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. అదే ఏడాదిలోనే రూ. 250.51 కోట్లతో అగ్రిమెంట్ ఖరారైంది. ఈ నిధులతో మేర్లపాక చెరువు నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు కెనాల్, లిఫ్ట్ నిర్మాణాలు చేపట్టాలి. నిర్మాణ సంస్థ పనులు చేపట్టి 12.22 శాతం పనులు పూర్తి చేసింది. దానికోసం రూ.30.61 కోట్లు ఖర్చు చేసింది. తర్వాత ప్రభుత్వం మారడంతో గత వైసీపీ ప్రభుత్వం ఈ పనుల టెండర్లను రద్దు చేసింది. ఆ తర్వాత టెండర్లు పిలవకపోవడంతో పనులు ఆగిపోయాయి. పనులు పూర్తి చేయడానికి రూ.219.90 కోట్లు, భూసేకరణ తదితర ఖర్చుల కోసం రూ.64 లక్షలు కావాలి. తాజాగా మంత్రివర్గం ఈ పనులు చేపట్టేందుకు అనుమతివ్వడంతో త్వరలో పనులు మొదలు కానున్నాయి.

● తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో తెలుగు గంగ ప్రాజెక్టు అతిథి గృహం నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. మెస్సర్స్ ఐ.మునిమోహన్‌రెడ్డి అండ్ కంపెనీ టెండర్లు దక్కించుకుంది.ప్రభుత్వం మారడంతో ఆలస్యంగా 2023 డిసెంబరులో అగ్రిమెంట్ ఖరారైంది. రూ. 3.78 కోట్లతో చేపట్టాల్సిన పనులు కేవలం రూ.41 లక్షల మేరకే జరిగాయి. ఆ మొత్తాన్నీ కాంట్రాక్టు సంస్థకు చెల్లించలేదు. తిరిగి పనులు మొదలుపెట్టేందుకు మంత్రివర్గం అనుమతిచ్చింది.

మామిడి సబ్సిడీ కింద రూ.260 కోట్లు

ప్రస్తుత సీజనులో ఉమ్మడి చిత్తూరు జిల్లా తోతాపురి మామిడి రైతులు ధరల పతనంలో నష్టపోకుండా ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.260 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో 76,700 మంది రైతులు 80 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్నారు. ఈ సీజనులో 6.50 లక్షల టన్నుల తోతాపురి మామిడి దిగుబడి వచ్చింది. ఈ మొత్తం సేకరణకుగానూ కిలోకు రూ.4 వంతున సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం దానికోసం రూ.260 కోట్లు మంజూరు చేసింది. తిరుపతి జిల్లా వరకూ చూస్తే 14,582 హెక్టార్లలో తోతాపురి సాగవుతోంది. ఆ మేరకు 1.45 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఈనెల 5వ తేదీ నాటికి జిల్లాలో 10,046 మంది రైతులకు చెందిన 67,988.68 టన్నుల తోతాపురి సేకరించడం జరిగింది. దానికి గానూ రైతులకు సబ్సిడీ కింద రూ. 27.18 కోట్లు చెల్లించాల్సి వుంది. మొత్తం తోతాపురి మామిడి సేకరణ పూర్తయితే సబ్సిడీ కింద రూ. 58 కోట్లు ప్రభుత్వం నుంచీ రైతులకు అందుతుంది.

నేడు మెగా పీటీఎం 2.0

తిరుపతి(విద్య), జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలల్లో కూడా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0 కార్యక్రమం గురువారం జరుగనుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెగా పీటీఎం నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 9 మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పీటీఎంలో కలెక్టర్, డీఈవోతో పాటు ప్రజాప్రతినిధులు కూడా పాల్గొననున్నారు. సమగ్రశిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈసమావేశానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులను సగౌరవంగా ఆహ్వానిస్తున్నామని, మీ పిల్లలతో మన పాఠశాల ఆవరణలో ఆనందంగా గడుపుతూ..వారి విద్యావికాసం, వివిధ అంశాల్లో అభివృద్ధిపై టీచర్లతో చర్చించేందుకే ఇది సదావకాశమని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 3,47,565మంది విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొననున్నారని వివరించారు. శ్రీకాళహస్తి జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి.. గూడూరు సీఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సత్యవేడు ఏపీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్‌లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి మంగళం ట్రెండ్స్ జడ్పీహెచ్ఎస్‌లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎంజీఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గూడూరు జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్, సూళ్లూరుపేట జడ్పీ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వడమాలపేట జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిల్లకూరు జడ్పీహెచ్ఎస్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొనన్నారు.

మోడల్ స్కూల్‌లో పాల్గొననున్న కలెక్టర్

వెంకటగిరిటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగే విద్యార్థులు, తల్లిదండ్రుల మెగా సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి తెలిపారు. తల్లిదండ్రులందరూ హాజరు కావాలని కోరారు.

ముక్కంటి ఆలయ సెక్యూరిటీ సూపర్‌వైజర్ దాష్టీకం

● మహిళా గార్డుపై దాడి ● బూతు పదజాలంతో వీరంగం

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ విభాగ సూపర్‌వైజర్ షణ్ముగం మహిళా గార్డుపై దాష్టీకానికి ఒడిగట్టాడు. తనకు విధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించిన గార్డుపై దాడి చేశాడు. ఆలయ ప్రాంగణంలో బూతు పదజాలంతో వీరంగం ప్రదర్శించాడు. ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ గార్డులకు రెండు షిఫ్టులుగా విధులను కేటాయిస్తుంటారు. ఆలయానికి అవసరమైన సంఖ్యకన్నా ముందు జాగ్రత్త కోసం అదనంగా సెక్యూరిటీ గార్డులను నియమించారు. ప్రతిరోజు రొటేషన్ ప్రకారం అందరికీ డ్యూటీలను సూపర్‌వైజర్ కేటాయించాలి. గత వైసీపీ పాలన నుంచి ముక్కంటి ఆలయంలో కొందరు సూపర్‌వైజర్లు తమ ఇష్టానుసారంగా ప్రవర్తించడానికి అలవాటు పడ్డారు.అయిన వారికే ఎక్కువగా డ్యూటీలు కేటాయించేవారు. తమకు వాటాలు సమర్పించే గార్డులను ఆలయంలో అక్రమ ఆదాయం సమకూర్చే చోట్ల మాత్రమే విధులు కేటాయిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో గీత అనే సెక్యూరిటీ గార్డు బుధవారం మధ్యాహ్నం విధుల కోసం ఆలయం వద్దకు వచ్చారు. పాయింట్ ఖాళీగా లేదని సూపర్‌వైజర్ షణ్ముగం చెప్పాడు. తనకు ఎందుకు అన్యాయం చేస్తావని ప్రశ్నిస్తూ.. అయిన వారికి రోజూ విధులు కేటాయించడంపై నిలదీశారామె. దీంతో ఆగ్రహానికి గురైన షణ్ముగం ఆమెతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా చెయ్యి చేసుకున్నాడు. దీనిపై ఆమె కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. గత వైసీపీ పాలన నుంచీ షణ్ముగంపై తీవ్రస్థాయి విమర్శలున్నాయి. గతంలో రెండుసార్లు సహచర సిబ్బందిపై రెచ్చిపోయాడు. భరద్వాజతీర్థం వద్ద రాత్రివేళ మద్యం తాగడం, మాంసం తినడంపై రెండేళ్ల క్రితం దుమారం రేగింది. అయినా, అప్పటి వైసీపీ పాలకుల అండతో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మళ్లీ తాజాగా ఆలయంలో మహిళాగార్డుపై దాడి చేయడం గమనార్హం.

పల్లం నుంచి పూడికి రైలు మార్గం

● 26 కిలోమీటర్ల మేర సర్వే పనులు ప్రారంభం

ఏర్పేడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు నుంచి పాతవీరాపురం, ఎండీపుత్తూరు మీదుగా వడమాలపేట వద్ద ఉన్న పూడి వరకు (26 కిలోమీటర్లు) కొత్త రైలు మార్గం ఏర్పాటు కానుంది. ఈ మార్గాన్ని పూడి రైల్వే స్టేషన్‌తో అనుసంధానించనున్నారు. సర్వే పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం రైల్వే అధికారులు ఎండీపుత్తూరు వద్ద స్థల పరిశీలన చేశారు. రైల్వే ట్రాక్ నిర్మాణానికి భూమి కోల్పోతున్న రైతులతో త్వరలో సమావేశమై పరిహారం తదితర విషయాలను చర్చించనున్నట్లు తెలిసింది.



ఎండీపుత్తూరు వద్ద స్థల పరిశీలన చేస్తున్నరైల్వే అధికారులు

'విజన్' యూనిట్ల ఏర్పాటుకు రూ.80 లక్షలు

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.80 లక్షలు కేటాయించింది. ఇప్పటికే ఈ యూనిట్లకు అవసరమైన సిబ్బందిని సచివాలయాల నుంచీ కేటాయించిన ప్రభుత్వం తాజాగా నిర్వహణకు అవసరమైన నిధులూ కేటాయించింది. జిల్లా స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ నిర్వహణకు రూ.10 లక్షలు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో యూనిట్ల నిర్వహణకు రూ. 10 లక్షలు చొప్పున మంజూరు చేస్తూ బుధవారం ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆశా' కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(వైద్యం), జూలై 9(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) కింద జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిలో ఖాళీగా ఉన్న 27 ఆశా కార్యకర్తల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 16 తేదీలోపు దరఖాస్తులను ఆయా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు అందించాలని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు సీజే శ్రీరామ్



తిరుమల, జూలై9(ఆంధ్ర జ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

త్వరలో విజయ్ 'జననాయకుడు'



నిర్మాత ఎన్కే లోహిత్ - ఆశీష్‌రెడ్డి - అన్నామలై

● సినీ నిర్మాత ఎన్కే లోహిత్

తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): దళపతి విజయ్ నటిస్తున్న 'జననాయకుడు' సినిమాను త్వరలో విడుదల చేయనున్నట్టు ఆ చిత్ర నిర్మాత ఎన్కే లోహిత్ తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో తెలుగులో ఓ భారీ చిత్రాన్ని తీయబోతున్నామని, నెలరోజుల్లో ఈ వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. అలాగే, శ్రీవారిని తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేత అన్నామలై, వ్యాసరాజ మఠాధిపతులు విశ్వప్రియ తీర్థ, ఈషాప్రియ తీర్థ, సినీ హీరో ఆశీష్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. 'దేత్తడి' చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభంకానుందని ఆశీష్‌రెడ్డి తెలిపారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,320

తలనీలాలు సమర్పించినవారు: 24,950



పట్టణాలకు మహర్దశ



అమృత్ 2.0 కింద నాలుగు జిల్లాలకు రూ.1622.63 కోట్లు

23 మున్సిపాలిటీల్లో ఇంటింటికి తాగునీరు

టెండర్లు ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్ అధికారులు

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనుంది. కనీస మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి వంటి పనులు చేసేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులు చేపడుతోంది. ఇటీవల ఈ స్థాయిలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరవడం ఇదే ప్రథమం. పబ్లిక్ హెల్త్ విభాగం ఈ పనుల నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలకు అమృత్ 2.0 పథకం కింద రూ.10,251 కోట్లను మంజూరు చేయగా.. అందులో పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.1622.63 కోట్లను కేటాయించారు. ఈ సర్కిల్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలున్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిధిలోని 23 అర్బన్ లోకల్ బాడీలకు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) నిధులను విభజించారు. ఆయా మున్సిపాలిటీల్లో అవసరాలను బట్టి నిధులు కేటాయించారు. అమృత్ 2.0 పథకం కింద నిధులను మూడు విభాగాలకు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి ఉన్నాయి. ఈ దఫా ఇంటింటికీ తాగునీటిని కుళాయిల ద్వారా ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసమే సింహభాగం నిధులను కేటాయించారు.

అమృత్ 2.0 కింద వివిధ మున్సిపాలిటీలకు మంజూరైన నిధుల వివరాలు...

మున్సిపాలిటీ	తాగునీటి సరఫరా (రూ.కోట్లు)	మురుగునీటి నిర్వహణ (రూ.కోట్లు)	నీటివనరుల అభివృద్ధి (రూ.కోట్లు)
గూడూరు	26.11	---	4.50
వెంకటగిరి	114.84	---	---
సూళ్లూరుపేట	1.47	----	5
నాయుడుపేట	3.50	----	1.18
చిత్తూరు	29.70	34.43	7.70
శ్రీకాళహస్తి	27.30	11.46	---
పుంగనూరు	14.35	----	----
పుత్తూరు	17.14	--	1.60
నగరి	17.93	---	2.20
పలమనేరు	15.81	---	2.20

రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం

ఈ నాలుగు జిల్లాల పరిధిలో రూ.1622.63 కోట్ల పనులకు పబ్లిక్ హెల్త్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. గత నెల 30న టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈనెల 28 వరకూ బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించారు. 23 మున్సిపాలిటీల్లో 73 వర్కులుగా విభజించారు. వాటన్నింటినీ ఒకే ప్యాకేజీగా టెండర్లు పిలిచినట్లు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. కాగా, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. నెల రోజుల్లోపు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆ వెంటనే పనులు మొదలు పెట్టించేలా సన్నాహాలు చేస్తున్నారు.

మీరే వెళ్తారా.. మమ్మల్ని పంపమంటారా?

● టీటీడీలోని అన్యమత ఉద్యోగులకు భానుప్రకాష్‌రెడ్డి హెచ్చరిక

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 'ఇతర దేవుళ్లను పూజించేవారు ఎవరైనా టీటీడీలో ఉంటే స్వచ్ఛందంగా వెళ్లిపోవాలి. లేకుంటే మేమే సాగనంపుతాం' అని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి అన్యమత ఉద్యోగులను ఉద్దేశించి హెచ్చరించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ఏసును ప్రార్థించే వ్యక్తులు టీటీడీలో పనిచేయాల్సిన అవసరం లేదన్నారు. 'స్వామి జీతం తీసుకుంటున్న కొందరు ఉద్యోగులు స్వామి హారతి, ప్రసాదం తీసుకోరు. వారి పేర్లేమో రాముడు, కృష్ణుడు అని ఉంటాయి. కానీ ప్రార్థించేదేమో ఏసుని. ఆ దేవుడిపై ప్రేముంటే ఆ దేవుడి దగ్గరే ఉండండి. మా దేవుడి దగ్గరకు రాకండి' అని అన్నారు. టీటీడీలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఇంట్లో టీటీడీ విజిలెన్స్ విభాగం ద్వారా తనిఖీలు చేయిస్తామని, వారి ఇళ్లలో హిందూ దేవుళ్ల చిత్రపటాలు కాకుండా అన్యమతానికి చెందిన చిత్రపటాలుంటే వారందరినీ ఉద్యోగం నుంచి తొలగించేలా రానున్న బోర్డులో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జనసాంద్రత ఆధారంగా మౌలిక వసతులకు రూపకల్పన

● కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సూచన



అధికారులతో సమీక్షిస్తున్న శ్రీనివాస్ కటికితల

తిరుపతి(కలెక్టరేట్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): జనాభా అవసరాల ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలని.. జనసాంద్రత ఆధారంగా మౌలిక సదుపాయాల రూపకల్పన జరగాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ కటికితల సూచించారు. తిరుపతి నగర సమగ్రాభివృద్ధిపై బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పలుఅంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'నగరాల విస్తరణకు బదులుగా అందులోని ఖాళీ భూముల వినియోగంతో ఎక్కువమందికి సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించండి. ఇదే అభివృద్ధికి సమర్థమైన మార్గం. విస్తృత ఆర్థిక జోన్ అభివృద్ధి ద్వారా తిరుపతి ప్రాంతానికి కొత్త రూపురేఖలను తీసుకురావాలన్నదే లక్ష్యం. పర్యాటకాన్ని కేవలం దర్శనానికే పరిమితి చేయకుండా, రాత్రి వసతితో కూడిన ప్యాకేజీలుగా మార్చడం ద్వారా వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుంది' అని వివరించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పెట్టుబడులను ఉపయోగించి వృద్ధి అవకాశాలను అధికంగా పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. దీనికి విజయవాడలోని కాళేశ్వర్‌రావు.. హైదరాబాదులోని బేగంబజారు మార్కెట్లను ఉదాహరణగా ప్రస్తావించారు. తిరుమల శ్రీవారిని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో పెళ్లిళ్లకు ఇష్టపడతారని, ఈ క్రమంలో నగరాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా భౌగోళిక పరిస్థితులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. జిల్లాలో 25 లక్షల జనాభా ఉంటే, తిరుపతిలోనే 4.5 లక్షలు ఉన్నారన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులపై వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఇషాకాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, జేసీ శుభంబన్సల్, కమిషనర్ మౌర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దాడి గర్హనీయం

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగన్ బంగారుపాళ్యం పర్యటన సందర్భంగా ఆంధ్రజ్యోతి చిత్తూరు ఫొటోగ్రాఫరు శివకుమార్‌పై వైసీపీ మూకల దాడిని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. చొక్కా చింపేసి విచక్షణారహితంగా కొట్టడం దారుణమని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, పి.నరేంద్ర మండిపడ్డారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ దాడిని తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కాళహస్తి గిరిబాబు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీమూకలను అరెస్టు చేయకపోతే ఉద్యమించాల్సి వస్తుందని ఫొటో జర్నలిస్టు అసోసియేన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, లావణ్యకుమార్ హెచ్చరించారు. మీడియా ప్రతినిధులను పార్టీలకతీతంగా చూడాలని, దురుద్దేశంతో దాడులకు పాల్పడడం అనైతిక చర్య అని ఏపీఎంఎఫ్ నాయకులు కల్లుపల్లి సురేంద్రరెడ్డి, డిల్లీబాబురెడ్డి పేర్కొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

●ఆరుగురి అరెస్టు

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో బుధవారం ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపిన ప్రకారం.. చెంగాళమ్మ ఆలయ సమీపంలోని వాటంబేడు రోడ్డులో అనుమానంగా తిరుగుతున్న కంపా చంద్రకాంత్(సూళ్లూరుపేట), అంకల భరత్ కౌశల్(విజయవాడ), బూరగ తేజ(తడ మండలం వెండ్లూరుపాడు), మండెం శైలేష్(సూళ్లూరు), పరింగి నరేంద్ర (తడ మండలం అనపగుంట), వేనాటి శ్రీహరి (నాగరాజపురం)లను పట్టుకుని పోలీసులు విచారించారు. వారి వద్ద 10 కిలోల గంజాయితోపాటు మోటారు సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వీరిని పట్టుకునేందుకు సహకరించిన ఏఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, సిబ్బంది గిరీష్‌కుమార్, సురేష్, విజయ్‌ను డీఎస్పీ అభినందించారు.

13న ఐఐటీలో ఇంక్యుబేషన్ కేంద్రం ప్రారంభం

ఏర్పేడు,జూలై9(ఆంధ్రజ్యోతి): ఆహార ప్రాసెసింగ్ రంగంలో యువ ఔత్సాహికులకు వేదికగా సామూహిక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఈనెల 13న ప్రారంభించనున్నారు. కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కూడా హాజరు కానున్నారు.

వెంకటగిరి నేతన్నకు జాతీయ పురస్కారం



మగ్గం నేస్తున్న శ్రీనివాసులు

వెంకటగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి బొప్పాపురం సాలికాలనీకి చెందిన లక్కా శ్రీనివాసులు 'సంత్ కబీర్' జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఆర్.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన స్వహస్తాలతో చీరపై నేసిన లక్ష్మీవృక్షం డిజైన్ జాతీయస్థాయి గుర్తింపు సాధించిందన్నారు. ఏటా కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ 15వ శతాబ్దపు ఆధ్యాత్మిక కవి సంత్ కబీర్ పేరిట ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. ఈ ఏడాది వెంకటగిరి నేతన్నకు ఈ అవార్డు దక్కడం విశేషం. ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని శ్రీనివాసులు అందుకోనున్నారు.

మరోమైలు రాయిని అధిగమించిన శ్రీసిటీ - వీఆర్వీ పరిశ్రమ



వీఆర్‌వీ పరిశ్రమ సరఫరా చేస్తున్న భారీ క్రయోజనిక్ ట్యాంకు

● ఖతార్ ఎయిర్ లిక్విడ్ సంస్థకు ఉత్పత్తుల ఎగుమతి

శ్రీసిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని క్రయోజనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ యూఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్‌వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ మరో మైలురాయిని అధిగమించింది. ఎయిర్ లిక్విడ్ తయారీలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఖతార్‌లోని ఎయిర్ లిక్విడ్ సంస్థకు అధిక సామర్థ్యం కలిగిన (సూపర్ సైజ్) లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంకును ఎగుమతి చేసింది. ప్రస్తుతం ఎగుమతి చేసిన క్రయోజనిక్ ట్యాంక్ 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగి ఉండడం విశేషం. మంగళవారం ఉదయం 192 చక్రాల మల్టీ యాక్సిల్ వాహనం ద్వారా ఈ ట్యాంకును కృష్ణపట్నం పోర్టుకు తరలించారు. ఈ సరఫరా ద్వారా అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజనిక్ ఇంధన నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపును వీఆర్‌వీ పరిశ్రమ దక్కించుకుంది. కాగా దేశంలో దాదాపు 17 సంవత్సరాలుగా నాణ్యత, నూతన ఆవిష్కరణలతో ప్రసిద్ధి చెందుతున్న వీఆర్‌వీ సంస్థ అమెరికాలోని ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థతో పాటు భారత్‌లోని ఇస్రోకు విశ్వసనీయ భాగస్వామిగా మారింది. కోవిడ్ సంక్షోభ సమయంలో దేశవ్యాప్తంగా ఆక్సిజన్ సిలిండర్లు, నిల్వ ట్యాంకులను వీఆర్‌వీ సరఫరా చేసింది. శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులతో పాటు తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు అందజేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను వీఆర్‌వీ సకాలంలో సరఫరా చేసి కీలక పాత్ర పోషించింది. కాగా మైలురాయిని అధిగమించిన వీఆర్‌వీ పరిశ్రమ యాజమాన్యానికి, ఉద్యోగులకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విజిలెన్స్ డీఎస్పీ అంటూ వీఆర్వో ఇంట్లో తనిఖీలు

● నకిలీ అధికారులకు రూ.1.20 లక్షలు సమర్పించిన వీఆర్వో

రేణిగుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ డీఎస్పీ అంటూ ఓ వీఆర్వో ఇంట్లో తనిఖీల పేరిట బెదిరించి రూ. 1.20లక్షలు తీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ సమీపంలోని జీవాగ్రంలో నివాసం ఉంటున్న భూపతి.. వడమాలపేట మండలం ఎస్వీపురంలో వీఆర్వో. గతంలో ఆయన రేణిగుంట, తిరుపతి రూరల్, అర్బన్ పరిధిలో వీఆర్వోగా పనిచేశారు. గత నెల 26న ఈయన ఇంటికి విజిలెన్స్ డీఎస్పీ, కానిస్టేబుళ్లు అంటూ నలుగురు వచ్చారు. గతంలో పనిచేసిన ప్రాంతాల్లో అక్రమాలకు పాల్పడి భారీ ఎత్తున ఆస్తులు కూడబెట్టావని, ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తే నీ ఉద్యోగం పోతుందంటూ బెదిరించారు. ఆందోళనకు గురైన భూపతి వారికి రూ.1.20 లక్షలు ఇచ్చారు. ఇది చాలదని, కొంత సమయం తీసుకుని మరింత నగదు ఇవ్వాలని చెప్పి వెళ్లిపోయారు. వారం తర్వాత నగదు ఇవ్వాలని ఫోన్ చేసి ఒత్తిడి చేయగా, ఆయన తన స్నేహితులకు చెప్పారు. వారి సూచన మేరకు నాలుగు రోజుల క్రితం గాజులమండ్యం పోలీసులకు భూపతి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీఆర్వో ఇంట్లోని సీసీకెమెరా ఫుటేజీని పరిశీలించారు. నలుగురిని నకిలీ అధికారులుగా గుర్తించారు. భూపతికి చేసిన ఫోన్ నెంబర్ల ఆధారంగా లొకేషన్ ట్రేస్ చేశారు. వారు కర్నూలు, అనంతపురానికి చెందిన వారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక సమ్మె



నల్లగొడుగులు, నల్లదుస్తులతో నిరసన - సభలో ప్రసంగిస్తున్న సీపీఐ నేత నారాయణ

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో వామపక్షాలు, కార్మిక సంఘాలు బుధవారం జిల్లాలో చేపట్టిన సార్వత్రిక సమ్మె ప్రశాంతంగా జరిగింది. ప్రజా జీవితానికి ఎలాంటి ఇబ్బందీ, అసౌకర్యం కలగని రీతిలో సీపీఐ, సీపీఎం పార్టీల అనుబంధ కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. తిరుపతిలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అనుబంధ కార్మిక సంఘాలు జోరుగా ర్యాలీలు నిర్వహించాయి. మానవహారంగా నిలబడ్డారు. అందరూ నాలుగు కాళ్ల మండపానికి చేరుకోగా.. సంయుక్తంగా బహిరంగసభ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఐఎఫ్‌టీయూ నేత వెంకటరత్నం తదితరులు ప్రసంగిస్తూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికుల పని వేళలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. పుత్తూరులో ఎల్ఐసీ ఉద్యోగులు కార్యాలయం మూసివేసి ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వామపక్షాల కార్యకర్తలతో కలసి బ్యాంకులను మూయించారు. ఇలా పలు చోట్ల ర్యాలీలు, మానవహారాలతో నిరసన తెలిపారు.

ప్రతి గ్రామానికీ మౌలిక వసతులు

● అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శులు గుర్తించాలి

● తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తుడా పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, కరెంటు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. తుడా పరిధిలో లేఅవుట్ అప్రూవల్, భవన నిర్మాణాల అనుమతులు, అమలు తదితర అంశాలపై 39 మంది ఎంపీడీవోలు, 1100కు పైగా గ్రామపంచాయతీల కార్యదర్శులకు బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత పాలకులు తుడాను భ్రష్టు పట్టించగా.. తాను గాడిలో పెడుతున్నానని తెలిపారు. అక్రమ లేఅవుట్లతో క్రైమ్ రేటు పెరుగుతోందని, ప్రజలు అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు లేఅవుట్, భవన నిర్మాణాల అనుమతులు వాటి అమలు, తుడా నిబంధనలు తెలుసుకోవాలని కోరారు. అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలను గుర్తించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని ప్రభుత్వ జీవోలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని అమలు చేయాలని తుడా వైస్ ఛైర్మన్ శుభం బన్సల్ కోరారు. తుడాకు, పంచాయతీ కార్యదర్శుల మధ్య ఉన్న సమాచారలోపాన్ని పూరిస్తామన్నారు. అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి? భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలను తుడా సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమారి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, డీపీవో సుశీలాదేవి, డీపీవో సురేష్ నాయుడు, మున్సిపల్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్, తుడా సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుడా ఛైర్మన్, జేసీ

కేసు వాదించడానికి వెళ్లి..!

● తిరిగొస్తుండగా ప్రమాదం ● ఇద్దరు న్యాయవాదుల దుర్మరణం

● వీరిలో ఒకరు తిరుపతివాసి



సుబ్రహ్మణ్యం యాదవ్, రాజగోపాల్ (ఫైల్‌ఫొటోలు)

తిరుపతి(నేరవిభాగం)/రాజంపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు వాదించడానికి రాజంపేట వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి, పీలేరుకు చెందిన న్యాయవాదులు సుబ్రహ్మణ్యంయాదవ్(70), నూలివేటి రాజగోపాల్(63) దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. న్యాయవాది సుబ్రహ్మణ్యంయాదవ్ తిరుపతిలోని డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులో కాపురం ఉంటున్నాడు. తిరుపతికి చెందిన కుమారస్వామి కేసు వాదించడానికి ఫిర్యాదుదారుడితో పాటు స్నేహితుడు పీలేరుకు చెందిన న్యాయవాది రాజగోపాల్‌తో కలిసి బుధవారం ఉదయం కారులో రాజంపేటకు వెళ్లారు. అక్కడ మధ్యాహ్నం 12.30గంటల వరకు కోర్టులో ఉన్నారు. ఆ తర్వాత తిరుపతికి తిరుగు ప్రయాణంలో రాజంపేట శివారు ప్రాంతంలోని అశోక గార్డెన్ సమీపానికి వచ్చారు. అదే సమయంలో రాయచూరుకు చెందిన వంగాల వెంకటేశ్వర్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, శైలజ, హాసిని, శంకరమ్మ తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో అక్కడికి చేరుకున్నారు. ఆ క్రమంలో వీరి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న న్యాయవాదుల కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు న్యాయవాదులు అక్కడికక్కడే మృతిచెందగా కుమారస్వామితో పాటు మరో కారులోని ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సుబ్రహ్మణ్యం యాదవ్‌కు ముగ్గురు పిల్లలు. ప్రవీణ్‌కృష్ణ దివ్యాంగుడు కాగా, వంశీకృష్ణ తిరుపతిలోని రాయలనగర్‌లో డెంటల్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. కుమార్తె గాయత్రి చంద్రకళ. ఈయన మృతిపట్ల తిరుపతి న్యాయవాదులసంఘం అధ్యక్షుడు గుట్టు గజేంద్ర, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


అభివృద్ధి పనుల ప్రారంభ శిలాఫలకం వద్ద పాశం

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం విందూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పించన్లు, దీపం వంటి హామీలను నెరవేర్చిందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగభృతి వంటి హామీలను నెరవేర్చుతుందన్నారు. గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును, రూ.5 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మల్లికార్జున్‌రెడ్డి, పెంచలరెడ్డి, కార్తీక్ రెడ్డి, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్ల రద్దు కోరుతూ కార్మిక సంఘాల ధర్నా



గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొత్త లేబర్‌కోడ్ రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. బుధవారం స్థానిక వివేకానంద రోడ్డులోని నీళ్లట్యాంకు ప్రాంతం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు సీఐటీయూ, ఏఐటీయూసీ తదితర కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు తదితర అనుబంధ కార్మికసంఘాలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కార్మికనాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లయ్య, శివకుమార్, ప్రభాకర్, శశికుమార్, బీవీరమణయ్య, మణి, శంకరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద బుధవారం మెప్మా రిసోర్స్ పర్సన్‌ల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చిత్రపటాలకు పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ రిసోర్స్‌పర్సన్‌లకు మూడు సంవత్సరాల ఉద్యోగ పరిమితిని రద్దుచేస్తూ ఉద్యోగ భద్రత కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా రిసోర్స్‌పర్సన్‌లకు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పెంచలయ్య, చందన, ఉషా, లక్ష్మీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్

డక్కిలి, జులై 9 (ఆంధ్రజ్యోతి) : డక్కిలి బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాధవితల బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఇటీవల ఆమె శ్రీకాళహస్తి గురుకుల కళాశాల నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులకు మంచి భోజనం అందించడంతోపాటు ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే రామకృష్ణ ఆమెకు సూచించారు.

సమాచార హక్కు చట్టంతో సమగ్ర సమాచారం



అవగాహన కల్పిస్తున్న ఉరుకుందమ్మ

నాయుడుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టం ద్వారా ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకంగా సమగ్ర సమాచారం అందుతుందని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. నాయుడుపేట అంబేద్కర్ భవన్‌లో బుధవారం సచివాలయ సిబ్బందికి, మెప్మా, పొదుపు మహిళలకు సమాచార హక్కుచట్టంపై అవగాహన కల్పించారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలకు సమాచార చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారయంత్రాంగం సవ్యంగా పనిచేయాలన్నా, అవినీతిని అరికట్టాలన్నా ఈ చట్టం ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ పాలనా కార్యదర్శులు లోకేశ్వరి, దయాశేఖర్, వెల్ఫేర్ కార్యదర్శి కిషోర్, వివిధశాఖల కార్యదర్శులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పారదర్శకంగా సవరణలు

నాయుడుపేట, జూ లై 9(ఆంధ్రజ్యోతి) :ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు పారదర్శకంగా ఉండాలని తహసీల్దారు ఎం. రాజేంద్ర సూచించారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌ల వారీగా 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. బదిలీలలో, వలస వచ్చిన ఓటర్లను గుర్తించి జాబితాలో చేర్చాలన్నారు. స్థానికంగా లేనివారిని గుర్తించి వారిని ఓటర్ల జాబితాలో తొలగించాలన్నారు.

ప్రసన్నకుమార్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుమహిళ నేతలు

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగుమహిళల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు మంచి పద్ధతికాదన్నారు. కార్యక్రమంలో గుండాల లీలావతి, శ్యామల, కల్పన, సుబ్బమ్మ, విజయమ్మ, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు. **పెళ్లకూరు:** ప్రసన్నకుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని నాయుడుపేట ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పునబాక పోలయ్య డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు గంగాబత్తిన రామకృష్ణ, భాస్కర్, రవి, భాస్కర్, శివ ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు: ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు, నేతలు, ప్రజా ప్రతినిధులకు మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ప్రజాదరణ కలిగి నిత్య ప్రజాక్షేత్రంలో ఉండే ప్రశాంతిరెడ్డికి సంబంధించి ఇష్టానుసారం మాట్లాడడం తగదన్నారు. ఆ పార్టీ అధినేత ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. తల్లిని, చెల్లిని బజారు వీధుల్లోకి లాగిన జగన్మోహన్ రెడ్డి మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఖండించకపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెల క్రమం తప్పకుండా జేవీవీ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, సుబ్బారావు, రజనీకాంత్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

గూడూరు అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారిలో దేశభక్తిని పెంపొందించేందుకు ఏబీవీపీ కృషిచేస్తుందని నాయకులు అన్నారు. బుధవారం ఓ ప్రైవేటు పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున, మనోజ్‌కుమార్, శ్రీకాంత్, మనోహర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు


మాధవ్‌కిఅభినందనలు తెలుపుతున్న కిషన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్‌ను విజయవాడలో బుధవారం జిల్లా యువమోర్చ అధ్యక్షుడు ఆరణి కిషన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు యువమోర్చ కార్యదర్శి కిరణ్‌రెడ్డి కూడా ఉన్నారు.

భూముల కన్వర్షన్‌పై పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వెంకన్నపాళెం, వీరారెడ్డి సత్రం గ్రామాల సమీపంలోని భూములను సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా బుధవారం పరిశీలించారు. ఇక్కడ ఉన్న 3.20 ఎకరాలను వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు చిట్టమూరు మండలం మల్లాం గ్రామానికి చెందిన దువ్వూరు సుజాతమ్మ సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ క్రమంలోనే సబ్ కలెక్టర్‌తోపాటు తహసీల్దారు జయజయరావు, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో కృష్ణయ్యలు ఆ భూములకు సంబంధించి కన్వర్షన్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు పరిశీలించారు.

తెలుగు యువత నేతకు అభినందన



కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుయువత మండల అధ్యక్షుడుగా ఎన్నికైన చల్లా సురేష్‌గౌడ్‌ను బుధవారం గోవిందపల్లి, వావిళ్ల దొరువు, కొత్తపట్నం, గున్నంపడియా, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం గ్రామాలకు చెందిన యువత పూలమాలలు, శాలువాలతో అభినందించారు. కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు వాటంబేటి చెంగల్‌రావు, ఇంగిలాల రామమోహన్, ఆవుల వెంకటరమణయ్య, రాజా, నన్నేసాహెబ్, శ్రీనివాసులు, మురళీ, మస్తానయ్యల ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

గిరిజన కాలనీలో గూడు కట్టుకున్న సమస్యలు


మరమ్మతులకు గురైన బోరు


గిరిజనకాలనీలోని ఈ మట్టిరోడ్డులో వర్షమొస్తే ఎన్ని ఇబ్బందులో..


శిథిలావస్థలో పక్కాగృహాలు

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి కూతవేటు దూరంలోని మధురెడ్డి గిరిజనకాలనీలో ప్రాథమిక వసతులు లేక ఇక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గూడూరు నుంచి వేములపాళెం వెళ్లే మార్గంలో ఈ గిరిజనకాలనీ ఉంది. కాలనీలో 43 కుటుంబాలు ఉంటున్నాయి. అందరివీ రెక్కాడితే గాని డొక్కాడని బతుకులే. రోజూ కూలిపనులు చేసుకుంటారు. కాలనీలోని రెండు వీధుల్లోనూ ఇప్పటికీ మట్టిరోడ్లే ఆధారం. సీసీరోడ్లు నిర్మించాలని చాన్నాళ్లుగా కోరుతున్నారు. ప్రభుత్వం గతంలో పక్కాగృహాలు నిర్మించింది. ప్రస్తుతం ఇవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షమొస్తే నివాసాలు ఉరుస్తున్నాయి. కొన్ని గృహాలు కనీసం నివాస యోగ్యం కూడా లేవు.

ఉపయోగపడని బోర్లు

రెండు ఉప్పునీటి బోర్లు నిరుపయోగంగా మారాయి. తాగునీటి కొళాయిల ద్వారా సరఫరాకు అంతరాయం కలిగితే దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సివస్తుందని స్థానికలు ఆవేదన చెందుతున్నారు. మట్టి రోడ్లతో యాతన పడుతున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ కాలనీపై దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

వరికి ఊపిరి పోసిన తెలుగుగంగ జలాలు



కాపుకంద్రిగ తెలుగుగంగ కాలువ నుంచి విడుదలైన నీరు- పొట్టదశలో వరి

తడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ నీళ్లతో చెరువులు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మాంబట్టు, వెండ్లూరుపాడు, కాదలూరు పరిధిలో వరి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది విపరీతమైన ఎండలు నేపథ్యంలో చెరువులు అడుగంటాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్పందించి తెలుగుగంగ అధికారులతో మాట్లాడారు. తెలుగుగంగ నీరు విడుదల చేయాలని కోరారు. అధికారులు సత్యవేడు మండలం కాపుకంద్రిగ వద్ద తెలుగుగంగ నుంచి కాలువల ద్వారా నీరు విడుదల చేశారు. 22 కిలోమీటర్ల నుంచి ఈ నీరు ప్రవహిస్తూ మాంబట్టు పెద్దచెరువు, వెండ్లూరుపాడు చెరువు అటు నుంచి కాదలూరు చెరువులకు చేరింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. ఈ మూడు పంచాయతీల్లో సుమారు 1500 ఎకరాలలోని వరిని ఈ జలాలు ఆదుకుంటున్నాయని, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి తెలుగుగంగ అధికారులకు మాజీ సర్పంచ్ వేనాటి రాజారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

దశల వారీగా సమస్యలకు పరిష్కారం:విజయశ్రీ


మహిళలకు కరపత్రం అందజేస్తున్న విజయశ్రీ

దొరవారిసత్రం, జూలై 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో ఆగస్టు 15 నుండి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం వేణుంబాక, పాలెంపాడు, నెలబల్లి గ్రామాల్లో ఆమె పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వేణుంబాక రోడ్డుకు నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారంతో కూడిన కరపత్రాలను ఇళ్లకు వెళ్లి అందజేశారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు, నాయకులు పామంజి శ్రీనివాసులు, శ్రీహరిరెడ్డి, రత్నయ్య, మురళిరెడ్డి, షబ్బీర్, జాన్‌రమేష్, నల్లారెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాలెంపాడు గ్రామానికి చెందిన బీపీ నాయకుడు రమణయ్య యాదవ్ మండల పార్టీ అధ్యక్షుడిపై మండిపడ్డారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.

అధికారులు హాజరు కాకపోతే చర్యలు తప్పవు

● మండల మీట్‌లో తహసీల్దారు హెచ్చరిక



మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల సమావేశానికి అధికారులు హజరుకాకపోతే చర్యలు తప్పవని తహసీల్దారు కటారి జయజయరావు హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలుశాఖల అధికారులు హాజరు కాలేదు. దీంతో తహసీల్దారు మాట్లాడుతూ సోమవారం గ్రీవెన్స్, నెలాఖరులో సివిల్ రైట్స్‌డే కార్యక్రమాలకు కూడా కొంత మంది హాజరుకావడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నోటీసులు ఇచ్చి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. నెల్లూరుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీటీసీ వేనాటి నారాయణకు సీడీపీవో మునికుమారి తెలిపారు. ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్‌లు పలు సమస్యలు ప్రస్తావించారు. ప్రజాప్రతినిధులు తగినంత మంది రాక సమావేశం సాదాసీదాగా జరిగింది. జడ్పీటీసీ కోటయ్య, రెండవ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శేషయ్య, ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణ సమీపంలోని కాశీలేవుట్‌లో అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఉదయం పలు అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రికి భజన చేశారు. .

దాతలు స్పందించాలని దంపతుల వేడుకోలు


వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దాతలు స్పందించి ఆదుకోవాలని పోటుపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ దంపతులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం తమ కుమారుడు పవన్ పంబలేరు వాగులో వరద ప్రవాహం వల్ల మృతి చెందాడన్నారు. తాము కిడ్నీవ్యాధితో డయాలసిస్ చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. దాతలు స్పందించి తమ చికిత్సకు సాయమందించాలని కోరుతున్నారు.

పాఠశాల సమీపాన పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దు


దుకాణంలో పోలీసుల తనిఖీ

డక్కిలి, జులై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, దేవాలయాలకు 200 మీటర్లు లోపు పొగాకు ఉత్పత్తుల విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఈ నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. బుధవారం డక్కిలి, డి.వడ్డిపల్లి హైస్కూళ్ల పరిసరాల్లోని దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. కొన్ని సిగరెట్లను గుర్తించి మరో సారి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

అంగన్వాడీల నిరసన

కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు బుధవారం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లపై తహసీల్దారు జయజయరావుకు అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు.

సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు




నాయుడుపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద - సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు సమీపాన కార్మికుల నిరసన

నాయుడుపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయు జిల్లా నాయకురాలు లక్ష్మీ కోరారు. నాయుడుపేటలో సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం సీఐటీయూ, అనుబంధ సంస్థలు ర్యాలీ నిర్వహించాయి. అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా నిలిచారు. సీఐటీయు నాయకులు శివకవి ముకుంద, మహేష్ బాబులు మాట్లాడుతూ కార్మిక చట్టాల అమలును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామలమ్మ, సుజాత, మునెమ్మ, విజయమ్మ, వనమ్మ, రమణయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **సూళ్లూరుపేట:** సూళ్లూరుపేటలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన ర్యాలీ చేశారు. వినాయకుడిగుడి సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేశారు. బస్టాండు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్మిక నాయకులు నాగరాజు లక్ష్మయ్య, చంద్రశేఖర్, అల్లెయ్య, నాగేంద్ర, ఎస్‌కే రియాజ్, సాంబశివయ్య, సుధాకర్ రెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు. **బాలాయపల్లి:** మండలంలోని అంగన్‌వాడీలు కేంద్రాలను మూత వేసి సమ్మెలో పాల్గొన్నారు. బాలాయపల్లిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అంగనవాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి స్వరూపారాణి, బేబిరాణి, సుమతి, నవమణి, సుజాత, మమత, వరలక్ష్మి పాల్గొన్నారు. **డక్కిలి:** తమకు వేతనాలు పెంచి, ముఖహాజరును ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సిఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తహసీల్దార్ ఎం శ్రీనివాసుల కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రసన్న, వెంకటమ్మ, సుకన్య, తులసి, లీలా, సుగుణ, తదితరులు పాల్గొన్నారు. **వాకాడు:** సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ హెల్పర్ అండ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పద్మలీల బుధవారం డిప్యూటీ తహసీల్దారు సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. సహకారబ్యాంక్ వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి కార్మికులు ప్రదర్శనగా బయలు దేరి మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, రైతు కూలీ సంఘం, సిఐటియు తదితర సంఘాలు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

వెంకటగిరిటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏపీ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల కోసం గురువారం వెంకటగిరి పోలకేంద్రం వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనుంది. ఏడీఈఈ మునిరవిచంద్ర బుధవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఛైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి(రిటైర్డ్ జడ్జి), ఆర్థిక సభ్యుడు మధుకుమార్, స్వతంత్ర సభ్యుడు డబ్ల్యూ. విజయలక్ష్మీలు పాల్గొంటారని వివరించారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల వినియోగ దారులు సద్వినియెగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినికి క్రీడాపరికరాల అందజేత

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తడ జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థిని గుర్రపు తేజశ్రీని బుధవారం సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు చంద్రబాబు అభినందించారు. బ్యాడ్మింటన్ క్రీడా సామగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్, పీఈటీ సునీత పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

నాయుడుపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దాడి కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఈ నెల 2వ తేదీ రాత్రి అగ్రహారపేటలో ఉంటున్న మహేశ్వరిపై ఆమె అల్లుడు రవీంద్రనాథ్ దాడి చేసి గాయపరిచి హత్యాయత్నం చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈమేరకే కేసు నమోదు చేసి నిందితుడ్ని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.